ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

ఆదివారం 23 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం)	సెహరీ (సోమవారం ఉదయం)
కడప	6.31	5.03
ప్రొద్దుటూరు	6.32	5.07



ఆంధ్రజ్యోతి లక్కీడ్రా సందర్భంగా మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, చిత్రంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, బ్యూరో ఇన్‌చార్జి అంజనేయులు, బ్రాంచ్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య, ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి, విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ డైరెక్టర్ తుంగా రమణయ్య, ఏబీఎన్ బ్యూరో శ్రీనివాసులు

ఆంధ్రజ్యోతితో తెలుగువారిది

విడదీయరాని బంధం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
- లక్కీడ్రా తీసిన అతిథులు

చెన్నూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు ఎక్కడున్నా వారికి ఆంధ్రజ్యోతితో విడదీయరాని బంధం ఉందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రెండు రాష్ట్రాల్లోని ఆంధ్రజ్యోతి పాఠకులకు లక్కీ డ్రా ద్వారా కోటి రూపాయల బహుమతులు ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా శనివారం కడప జిల్లా యూనిట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతికి ఆంధ్రులన్నా ఆంధ్రులకు ఆంధ్రజ్యోతి అన్నా ఎనలేని అభిమానమన్నారు. నిత్యం నూతన కథనాలతో ప్రజల్లోకి వెళుతున్న ఆంధ్రజ్యోతి లక్కీ డ్రా ద్వారా పాఠకులకు ఎన్నో కానుకలు అందించాలనుకోవడం అభినందనీయమన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచిన ఆంధ్రజ్యోతికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి యేటా ఇలాంటి లక్కీడ్రా నిర్వహించడం అభినందనీయమన్నారు. మొత్తం 20 యూనిట్లలో ఆంధ్రజ్యోతి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ 22 ఏళ్ల పూర్తి చేసుకోవడం సంతోషకరమన్నారు. విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తుంగా రమణయ్య మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా సరికొత్త కథనాలతో పాఠకుల మనసులు చూరగొంటున్న ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



లక్కీ డ్రా కార్యక్రమానికి హాజరైన ఆంధ్రజ్యోతి పాఠకులు





లక్కీ డ్రా తీసి, మొదటి బహుమతి విజేత తన్మయి తల్లి అనితను ఫోన్‌ద్వారా అభినందిస్తున్న కలెక్టర్

మొదటి విజేత ప్రొద్దుటూరు వాసి

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చేతుల మీదుగా లక్కీ డ్రా తీసి మొదటి విజేతను తెలిపారు. మొదటి విజేత ప్రొద్దుటూరుకు చెందిన గిద్దలూరు తన్మయితో కలెక్టర్ ఫోనులో మాట్లాడి అభినందనలు తెలిపారు. అలాగే రెండో డ్రాను హరిప్రసాద్ తీయగా వేంపల్లెకు చెందిన ఎం.శ్రీనాథ్ విజేత అయ్యారు. తుంగా రమణయ్య తీసిన డ్రాలో బద్వేలుకు చెందిన ఎస్.భవాని మూడో విజేతగా నిలిచారు. వంద కన్సొలేషన్ బహుమతుల్లో మొదటి డ్రాను చెన్నూరు తహశీల్దారు సరస్వతి చేతుల మీదుగా తీశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య, ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి, బ్యూరో ఇన్‌చార్జి ఎక్కంటి అంజనేయులు, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ కె.రామ్మోహన్‌రెడ్డి, ఏడీవీటీ మేనేజర్ డి.శ్రీధర్, ఏబీఎన్ ప్రతినిధి శ్రీనివాసులు, కడప వీసీ ఇన్‌చార్జి విలియం జాన్, ఆంధ్రజ్యోతి సిబ్బందితో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పాఠకులు లక్కీడ్రా లో పాల్గొన్నారు.

18ఏళ్లుగా ఆంధ్రజ్యోతి చదువుతున్నా



18 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి పత్రిక మా ఇంటికి వస్తుంది. లక్కీడిప్ ద్వారా ద్వితీయ బహుమతి ఫ్రిజ్ రావడం సంతోషంగా ఉంది. మేము ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు తయారుచేసే షాపు నిర్వహిస్తున్నాం. లక్కీడిప్‌లో ద్వితీయ బహుమతి పొందడం చాలా సంతోషంగా ఉంది. ప్రతి సంవత్సరం కూపన్లు పంపుతున్నా. ఈ ఏడాది కచ్చితంగా వస్తుందని ఆశించాను. అదృష్టం వరించింది. నిజాలను నిర్భయంగా, ఉన్నది ఉన్నట్లు రాయడం ఆంధ్రజ్యోతిలో చూస్తుంటాను. అందుకే ఎంతో మంది వేరే పేపర్ వేసుకోండని చెప్పినా.. నేను ఆంధ్రజ్యోతి పత్రికనే చదువుతున్నా.

- మిట్టా నరసింహ, ద్వితీయ బహుమతి, వేంపల్లె

'ఆంధ్రజ్యోతి' మా ఇంటి పత్రిక



'ఆంధ్రజ్యోతి' మా ఇంటి పత్రిక. పదేళ్ల క్రితం గిద్దలూరు అనిల్‌తో నాకు పెళ్లి అయి అత్తగారింటికి వచ్చినప్పటి నుంచి ఇంట్లో నేను రోజూ చూసేది ఆంధ్రజ్యోతి పత్రికే. మా మామ గారు గిద్దలూరు అంకన్నగారు ఆంధ్రజ్యోతికి పెద్ద అభిమాని. నిజాలు నిర్భయంగా రాయగల పత్రిక ఆంధ్రజ్యోతి ఒక్కటే. 2016లో మా పాప తన్మయి పుట్టినప్పుడు ఆ పాప పేరుతో లక్కీ డిప్‌లో పాల్గొన్నాం. అప్పుడు కన్సొలేషన్ బహుమతి గా రైస్ కుక్కర్ వచ్చింది. అప్పటి నుంచి మిస్ కాకుండా ప్రతిసారి తన్మయి పేరుతో లక్కీ డిప్‌లో పాల్గొంటున్నాం. ఇన్నేళ్లకు మాకల ఫలించి ఫస్ట్ ప్రైజ్ వచ్చింది.

- తన్మయి తల్లి అనిత, మొదటి బహుమతి, ప్రొద్దుటూరు

సంతోషంగా ఉంది



ఆంధ్రజ్యోతి దినపత్రిక నిర్వహించిన లక్కీ డిప్‌లో విజేతగా నిలిచి టీవీని దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉంది. వార్తల విషయంలో ప్రజలపక్షాన నిలబడి వారి సమస్యలు పరిష్కరించడ మే కాకుండా ఇలా లక్కీడిప్‌లు ఏర్పాటు చేసి ఆంధ్రజ్యోతి అభిమానులకు బహుమతులు అందజేయడం హర్షించదగ్గ విషయం. మాకు ఎప్పటినుంచో టీవీ తెచ్చుకోవాలనే కోరిక ఉండేది. ఆంధ్రజ్యోతి పత్రిక ద్వారా ఆ కోరిక తీరడం సంతోషం. ఆరోగ్యానికి సంబంధించిన విషయాలు, మహిళల విజయాలు ఆంధ్రజ్యోతిలో నాకు బాగా నచ్చుతాయి.

- భవాని, తృతీయ బహుమతి, బద్వేలు

దస్తగిరి భార్యపై దాడి కేసులో ఇద్దరు మహిళల అరెస్టు

పులివెందుల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి భార్య షబానాపై దాడి కేసులో ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం తొండూరు మండలం మల్లేల గ్రామానికి చెందిన కులుసుం, పర్వీన్‌లకు శనివారం తొండూరు పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని పోలీసులు 41 నోటీసు అందించారు. ఈ మేరకు వీరు శనివారం తొండూరు పోలీస్‌స్టేషన్‌కు విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం వీరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా దస్తగిరి భార్య షబానాతో కలసి నాలుగురోజుల క్రితం తొండూరులో బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఇద్దరు మహిళలు తనపై దాడికి పాల్పడ్డారని, చంపేస్తామని బెదిరించారని షబానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ చిన్నపెద్దయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా 41 నోటీసు ఇచ్చినపుడే అరెస్టు చేసినట్లు భావించవచ్చన్నారు. అరెస్టు చేశారా అని ప్రశ్నించినప్పటికి ఆయన మరోమారు 41నోటీసు ఇచ్చినపుడే వారిని అరెస్టు చేసినట్లు అని సమాధానం ఇచ్చారు.

రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌కు పదిమంది ఎంపిక



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నెహ్రూయువ కేంద్ర జిల్లా యుజజన అధికారి మణికంఠ

కడప మారుతీనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ క్రీడా, యుజన వ్యవహారాల శాఖ, నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో 'వన్‌నేషన్ వన్ ఎలక్షన్' అనే అంశంపై కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో యువతకు ఉపన్యాస పోటీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఉపన్యాస పోటీలలో పదిమందిని ఎంపిక చేసినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ వెల్లడించారు. వెంకటసాహిత్య, షేక్ అమీషానాజ్, ప్రొద్దుటూరు దస్తగిరిబాష, జేపీ సంజన, షేక్ అర్షియా అహ్మద్, మహమ్మద్ కౌసర్, ఆకుల కంబగిరిస్వామి, కె. వెంకటసాయినాథ్‌రెడ్డి, హేమంత్‌కుమార్, వివేకానందరెడ్డి ఎంపికయ్యారని వీరు రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ ఉపన్యాస పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

బెంగళూరులో పార్కింగ్ సమస్య తీరేనా..?

- రెండు రోజుల క్రితం బెంగళూరులో కడప ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి
- కర్ణాటక డ్రైవర్‌ను సస్పెండ్ చేసిన అక్కడి ప్రభుత్వం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ ఆదాయానికి బెంగళూరు గుండెకాయలాంటిది. కడపకు వచ్చే ఆదాయంలో ఈ రూటే కీలకం. జిల్లావాసులు అక్కడ పీజీ హాస్టల్స్ ఏర్పాటు చేశారు. ఇక చదువు, వ్యాపారం ఇతరత్రా వాటికి బెంగళూరుతో కడప జిల్లాకు ఎక్కువ అనుబంధం ఉంది. అందుకే కడప డిపో నుంచి రోజూ 35 ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. దీన్నిబట్టి చూస్తే జిల్లాకు బెంగళూరు ఎంతో కీలకమని అర్థమవుతుంది. అయితే దాదాపు పదేళ్ల పైనుంచి ఇక్కడ పార్కింగ్ సమస్యగా మారింది. పార్కింగ్ విషయంపై కడప జిల్లా బస్సు డ్రైవర్లతో కర్ణాటక డ్రైవర్లు గొడవలకు దిగుతుంటారు. బెంగళూరులో పార్కింగ్ స్థలం కోసం కొన్నేళ్ల నుంచి ప్రయత్నం చేస్తున్నా అది ఇంకా అమలుకు నోచుకోవడం లేదు.

ప్రొద్దుటూరు డిపో బస్సు డ్రైవరు నరాల రవిశంకర్‌రెడ్డిపై మెజిస్టిక్ వద్ద కేఎస్‌ఆర్‌టీసీ డ్రైవరు హనుమంతు చరవాది గురువారం రాత్రి తీవ్రంగా దాడి చేశారు. ఈ ఘటనలో రవిశంకర్‌రెడ్డికి పక్కటెముకలు రెండు చిట్లాయి. బస్సుకు అడ్డంగా ఉన్న కర్ణాటక బస్సును వెనక్కి తీయాలని కోరడంతో గొడవ మొదలైనట్లు చెబుతారు. ఈ గొడవలో రవిశంకర్‌రెడ్డి కింద పడిపోగా కర్ణాటక డ్రైవరు హనుమంత చరవాది కాలితో తల, నడుము, పొత్తికడుపుపై ఇష్టారాజ్యంగా దాడి చేశాడు. ఇంత జరుగుతున్నా అక్కడ జనాలు సిబ్బంది అడ్డుకోకపోవడం గమనార్హం. రవిశంకర్‌రెడ్డిని బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రాణభయం లేదని వైద్యులు వెల్లడించారు. ఇక డ్రైవరుపై దాడి నేపథ్యంలో కడప ఆర్టీసీ చైర్మన్ నాగరాజు బెంగళూరుకు వెళ్లి డ్రైవరును పరామర్శించారు. ఈ దాడి ఘటనపై బెంగళూరు ఉప్పారపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణాటక ప్రభుత్వం కేఎస్‌ఆర్‌టీసీ డ్రైవరును సస్పెండ్ చేసింది. కాగా.. కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్ దాడిలో గాయపడి బెంగళూరులోని శ్రీనివాస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రొద్దుటూరు డిపోకు చెందిన డ్రైవర్ నరాల రవిశంకర్‌రెడ్డిని శనివారం డిశ్చార్జి చేశారని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

ఆయనో మోనార్క్

- వైసీపీ ఏజెంటులా పనితీరు
- ప్రభుత్వం మారినా అతని తీరు మార(లే)దు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

ఆయనో మోనార్క్. ఓ మండలానికి విద్యాశాఖ అధికారిగా ఉంటూ కర్రపెత్తనంతో ఉపాధ్యాయులను వేధిస్తుంటాడు. ఎవరైనా ప్రశ్నిస్తే ఇక అంతే. జగన్ ప్రభుత్వంలో ఆయన వైసీపీ కార్యకర్తలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబుపై వ్యంగ్యంగా పోస్టులు పెట్టారు. తనకు నచ్చితే అది తప్పైనా ఒప్పు అయ్యేటట్లు చేస్తాడు. నచ్చకపోతే తన పైఅధికారుల ఆర్డర్స్‌ను సైతం పట్టించుకోడు. ఈయన సీకేదిన్నె మండలం ఎంఈఓ-1గా పనిచేస్తున్నారు. ఈయన రూటే సపరేటు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన ప్రవీణ్‌ప్రకాశ్‌కి ఏమాత్రం తీసిపోరు.

కడప ఎడ్యుకేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఆయనో మండల స్థాయి అధికారి. ఆది నుంచి ఆయన ఎక్కడ పనిచేసినా వివాదాస్పదమే. గతంలో తొండూరు ఎంఈఓగా విధులు నిర్వర్తించే సమయంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. అనేక పొరపాట్లు చేస్తూ అక్కడ పనిచేయలేక అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల సహకారంతో సీకేదిన్నె ఎంఈఓగా వచ్చారు. ఇక్కడికి వచ్చాక వైసీపీకి ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు. సీకేదిన్నె ఎంఆర్‌సీలో గత ప్రభుత్వ పాలనలో రంజాన్ మాసంలో వైసీపీ రాజకీయ పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దీనిపై హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేశ్ డేగల అప్పటి డీఈవోకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మారినా ఆయన తీరు మారలేదు. ప్రధానోపాధ్యాయుల సమావేశాలలో, కాంప్లెక్స్ సమావేశాలలో బహిరంగంగానే గత ప్రభుత్వాన్ని సమర్థిస్తూ ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘం వైఎస్సార్‌టీఏ, కడప వాట్సాప్ గ్రూప్‌లో ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టింగ్స్ పెడుతున్నారు. ఈనెల 14న వైఎస్సార్‌టీఏ వాట్సప్ గ్రూప్‌లో నిరుద్యోగ భృతిపై స్వయంగా ముఖ్యమంత్రి మాటలనే ప్రశ్నిస్తూ అహంకార ధోరణితో "గొర్రెల్లా నమ్మేస్తున్నారయ్యా మీ మాటలు మా ఏపీ ప్రజలు.. 40 సంవత్సరాల నుంచి మీ మాటలు ఇలా ఉన్నాయి" అంటూ పోస్టు పెట్టారు. సీఎంనే విమర్శించే ఈ అధికారి తన వద్ద పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయుల పట్ల ఎలా వ్యవహరిస్తారో చెప్పాల్సిన పనిలేదు.



ఆరోపణలు ఇలా

- ఉపాధ్యాయులకు సెలవుల మంజూరులో నియంతలా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పాఠశాలల తనిఖీ సమయంలో ఉపాధ్యాయులను అనేక రకాలుగా తన మాటల ద్వారా, చేష్టల ద్వారా భయాందోళనకు గురిచేస్తున్నారు. సమావేశంలో ఉపాధ్యాయులను అవహేళనగా మాట్లాడుతున్నారు. మహిళా ఉపాధ్యాయులను కించపరిచే విధంగా మాట్లాడి ఇబ్బందికి గురిచేస్తున్నారు.
- డీఈఓ ఆదేశాల మేరకు కడప ఎంఈఓ కడపతో పాటు కడప చుట్టుపక్కల మండలాల నుంచి కొంతమంది ఉపాధ్యాయులకు ఏపీఈఈ-2025 ఇన్విజిలేషన్ విధులు కేటాయించారు. ఇందులో చింతకొమ్మదిన్నె మండలంలోని ఏడుగురు ఉపాధ్యాయులకు కూడా విధులు కేటాయించారు. ఎంఈఓ-1 వెంకటరామిరెడ్డి సమయానికి స్పందించకపోవడంతో ఎంఈఓ-2 సదరు ఉపాధ్యాయులను రిలీవ్ చేశారు. అయితే తన పర్మిషన్ లేకుండా ఎలా వేస్తారు అంటూ పరీక్ష ప్రారంభం కావడానికి కొద్ది నిమిషాల ముందు అందరినీ ఎగ్జామ్ సెంటర్ల నుంచి వెనక్కి రప్పించుకున్నారు.
- సీకెదిన్నె ఎంపీపీఎస్‌లో జి.విష్ణువర్ధన్‌రెడ్డి, పి.శ్రీనివాసులు అనే ఉపాధ్యాయులు పనిచేసేవారు. కానీ పి.శ్రీనివాసులును (బలహీనవర్గం) ఇబ్బంది పెట్టడానికి జి.విష్ణువర్ధన్‌రెడ్డిని దాదాపు 85 రోజులు డిప్యుటేషన్ పంపారు. పి.శ్రీనివాసులు తమ దగ్గర బంధువుల పెళ్లికి లీవ్ దరఖాస్తు చేసి వెళ్లారు. సెలవు రద్దు చేసి ఆయనను పెళ్లి నుంచి వెనక్కి పిలిపించుకున్నారు.
- ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించిన బిల్లులన్నీ డీడీఓగా ఎంఈఓ-1 ట్రెజరీకి సబ్మిట్ చేయాల్సి ఉంది. కొన్ని రకాల బిల్లులను ఉపాధ్యాయులే బయట తయారు చేసుకొచ్చి ఇస్తేనే సబ్మిట్ చేస్తానంటూ వారు ఆర్థికంగా ఇబ్బంది పడేలా చేస్తున్నారు.
- ఎర్రమాచుపల్లె ఎంపీపీ స్కూల్‌లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా జయమ్మ పనిచేస్తున్నారు. తన భర్తకి, తనకు ఆరోగ్యం సరిగా లేక సెలవు పెట్టారు. సంక్రాంతి సెలవుల తర్వాత స్కూల్‌లో జాయిన్ కావాలి. కానీ తన భర్త మరణించడం వలన పాఠశాలలో జాయిన్ కాలేకపోయారు. ఆ పరిస్థితుల్లో ఎంఈఓ-1 ఓదార్చాల్సింది పోయి నీవు సంక్రాంతి తర్వాత జాయిన్ కాలేదు, మీరు తీసుకున్న జీతం వెనక్కి కట్టాలి అంటూ వారిపై చర్యలు తీసుకున్నారు.
- సహచర అధికారి అయిన ఎంఈఓ-2 రమాదేవిని గౌరవించాల్సింది పోయి ఉపాధ్యాయులు, సంఘ నాయకుల దగ్గర ఆమెని కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు. ఎమ్మార్సీ గ్రాంటును ఎంఈఓ-2తో సంప్రదించకుండానే డ్రా చేసుకొని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపై ఎంఈఓ-2 ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు పనిచేసిన ప్రతి చోటా వివాదాస్పదుడిగా ముద్రపడినా.. ఈయనపై ఎటువంటి విచారణ గాని చర్యలు గాని లేకపోవడం గమనార్హం.

సీకేదిన్నె ఎంఈవో సస్పెన్షన్

సీకేదిన్నె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె ఎంఈఓ ఉండేల వెంకటరామిరెడ్డిని సస్పెండ్ చేశారు. ఈయన ప్రభుత్వంపై ముఖ్యమంత్రిపై సోషియల్ మీడియాలో వచ్చిన పోస్టింగ్‌లను వైఎస్సార్‌టీఏ గ్రూపులో పెట్టడంపై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టినందుకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఎంఈఓను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ ఆఫీసు నుంచి ఉత్తర్వులు అందాయి. సోషల్ మీడియాలో ఇటీవల వస్తున్న ప్రభుత్వ వ్యతిరేక పోస్టులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ఎంఈవోను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

వైసీపీ పాలకమండలికి టీడీపీ షాక్

- కమిషనర్ సహా టీడీపీ కౌన్సిలర్లు గైర్హాజరు
- అక్కడే బైఠాయించి నిరసన తెలిసిన చైర్‌పర్సన్
- సాయంత్రం వెళ్లి సర్దిచెప్పిన కమిషనర్



మున్సిపల్ కార్యాలయంలో నిరసన చేపట్టిన చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్లతో చర్చిస్తున్న కమిషనర్

ప్రొద్దుటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వైసీపీ పాలకమండలికి టీడీపీ షాక్ ఇచ్చింది. శనివారం ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశానికి మున్సిపల్ కమిషనర్‌తో సహా అధికారులు, టీడీపీ కౌన్సిలర్లు హాజరుకాలేదు. దీంతో వైసీపీకి చెందిన చైర్‌పర్సన్‌తో సహా 21 మంది కౌన్సిలర్ల మెజారిటీ ఉన్నా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించలేకపోయారు. మొదట మున్సిపల్ ఆర్డీకి ఫోన్ చేసి అధికారులకు అరగంట సమయం ఇస్తున్నామని అప్పటివరకు సభ వాయిదావేస్తామని చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి ప్రకటించి సమావేశ మందిరం నుంచి కిందకు వచ్చి వైఎస్ విగ్రహం వద్ద బైఠాయించారు. అరగంట దాటినా కమిషనర్ రాకపోవడంతో మున్సిపల్ కమిషనర్ అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, ఆయన వచ్చేవరకు ఇక్కడే ఉంటామని ఆమె ప్రకటించారు. మధ్యాహ్నం అక్కడే భోజనాలు తిన్నారు. ఎన్నిరోజులైనా ఇక్కడే ఉండి నిరసన చేపడతామని చైర్‌పర్సన్ హెచ్చరించారు. దీంతో సాయంత్రం 5.30 గంటలకు కమిషనర్ మల్లికార్జున మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేస్తున్న వైసీపీ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు బంగారు రెడ్డి ఖాజా, కౌన్సిలర్లతో మాట్లాడారు. కమిషనర్‌గా తన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే సమావేశం ఏర్పాటు చేశారన్నారు. దీనికి తోడు తాను అస్వస్థతకు గురయ్యానన్నారు. ఇందుకు వైసీపీ సభ్యులు మాట్లాడుతూ.. మీరు రాకున్నా డెలిగేట్ కమిషనర్‌ను పంపించి సమావేశం నిర్వహించి ఉండవచ్చన్నారు. ఇరువురి మధ్య వాదనలు సాగి అనంతరం ఈ సమావేశాన్ని సోమవారం సాయంత్రం 4 గంటలకు ఇదే అజెండాతో పెట్టి మళ్లీ 29న సాధారణ సమావేశం నిర్వహించేలా అంగీకరించారు. దీంతో ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటలవరకు సాగిన హైడ్రామాకు తెరపడింది. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ భావనతో సహా సీఐలు రామకృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, బాల మద్దిలేటి, దేవ కిరణ్‌కుమార్, ఎస్‌ఐలు సంజీవ్‌రెడ్డి, శ్రీనువాసులు, ధనుంజయుడు పర్యవేక్షించారు.

సిరులు కురిపించిన తీపి గుమ్మడి సాగు ఇప్పుడు రైతుకు గుదిబండగా మారుతోంది. గత ఏడాది ఆగస్టు నుంచి జనవరి వరకు కిలో రూ.6 నుంచి రూ.16 వరకు ఉన్న ధర, గత ఇరవై రోజుల్లో కిలో రూ.2 కు పడిపోయింది. కాయల కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రాక పోవడంతో, దిక్కుతోచని రైతులు గుమ్మడి కాయలను తోటల్లోనే వదిలేస్తున్నారు. మరికొంత మంది తోటల్లో చూడలేక తెంపి పొలం బయట చెట్ల కిందనో, రోడ్డు పక్కనో పడేస్తున్నారు. విత్తనం పెట్టినపుడు ఉన్న ధర దిగుబడి వచ్చే సమయానికి లేకపోవడంతో పెట్టుబడి కూడా దక్కక నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన గుమ్మడి ఎగుమతి అయ్యే రాష్ట్రాల్లో ఇపుడు దిగుబడులు వస్తుండటమే ధరల పతనానికి కారణమని రైతులు వాపోతున్నారు.



ధరాపాతం!

- భారీగా పతనమైన తీపి గుమ్మడి ధర
- కిలో రూ.2కూ కొనేవారు లేరు
- కోత కూలి కూడా రాదని.. పొలాల్లోనే..
- పొలం గట్లపై కుప్పలుగా.. కోసిన కాయలు
- పెట్టుబడికీ గండి!

తంబళ్లపల్లె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో నికరమైన ఆదాయం వస్తుండటంతో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో క్రమక్రమంగా గుమ్మడి సాగు పెరుగుతోంది. ఈ క్రమంలో గత డిసెంబరు, జనవరి మాసాల్లో రెండు నియోజకవర్గాల్లో సుమారు 200 ఎకరాలకు పైగా గుమ్మడిని సాగు చేశారు. దున్నకం దగ్గర నుంచి విత్తనం, ఎరువులు, కాయలు కోత కూలీలు అన్నీ కలిపి ఎకరాకు సుమారు రూ.20 నుంచి రూ.25 వేలు వరకు పెట్టుబడి పెట్టారు. సాధారణంగా భూమి స్వభావం, అనుకూలతను బట్టి ఒక ఎకరానికి సరాసరి 7 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు, జనవరి వరకు గుమ్మడి ధరలు కిలో రూ.6 నుంచి రూ.16 మధ్యలో ఉండేవి. తీరా దిగుబడి వచ్చేసరికి కిలో ధర రూ.1, 2లకు పడిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు 9 టన్నుల దిగుబడి వస్తే, కిలో రూ.2 చొప్పున విక్రయిస్తే రూ.18వేలు ఆదాయం వస్తుంది. పెట్టుబడి రూ.20వేలు అనుకున్నా, సొంత కష్టం పోనూ రైతుకు రూ.2వేలు నష్టం వస్తుంది. అయితే, కిలో రూ.4లకు ధర పలికినా నష్ట ఉండదని రైతులు చెపుతున్నారు.

ఆ ఐదు నెలలు మంచి డిమాండ్

సాధారణంగా మన నేలల్లో పండిన గుమ్మడికి సెప్టెంబరు నుంచి జనవరి వరకు బయట రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడులతో పాటు కలకత్తా, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, అస్సాం తదితర రాష్ట్రాలకు లారీల్లో ఎగుమతి అవుతుంటాయి. అక్కడి ప్రజలు గుమ్మడి కాయలను ఎక్కువగా హల్వా, స్వీట్లు, కేకులతో పాటు సాంబారుల్లో ఉపయోగిస్తుంటారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, జనవరి మాసాల్లో వినాయకచవితి, దీపావళితో పాటు పెద్ద పండుగలైన దసరా, సంక్రాంతి ఉండటంతో బయటి రాష్ట్రాల్లో తీపి గుమ్మడికి మంచి డిమాండ్ ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడి రైతులు జూన్ నుంచి సెప్టెంబరు నెలల్లో ఎక్కువగా గుమ్మడిని సాగు చేస్తుంటారు. అయితే, మహాశివరాత్రి, రానున్న ఉగాది పండుగలను దృష్టిలో ఉంచుకుని మంచి ధర ఉంటుందనే నమ్మకంతో పలువురు రైతులు డిసెంబరు, జనవరి నెలల్లో గుమ్మడిని సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో ధరలు పతనం కావడంతో కాయలను కొనే వారే లేక తోటలోనే వదిలేస్తున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వ్యాపారులు రావడం లేదు

సాధారణంగా వ్యాపారులు నేరుగా తోట వద్దకు వచ్చి కాయలు కొనుగోలు చేసి బయటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. కాయలు పక్వానికి రాకముందే వ్యాపారులు తోటల్లో వాలిపోయి ముందుగానే రేటు కుదుర్చుకుని అడ్వాన్సులు ఇస్తుంటారు. అయితే నెల రోజులుగా గుమ్మడి తోటల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. వ్యాపారులకు రైతులు పదే, పదే ఫోన్లు చేసి మా దగ్గర పంట ఉంది ఎంతో కొంత ఇచ్చి కోసుకెళ్లండి అంటున్నా వారు ఈ రోజొస్తాం, రేపొస్తాం, ఇప్పుడు ధర లేదు అంటూ కాలం గడిపేస్తున్నారు. దీనికి కారణం మన కాయలు దిగుమతి చేసుకుంటున్న రాష్ట్రాల్లో గుమ్మడి దిగుబడులు వస్తుండడంతో ధర కుప్పకూలినట్లు రైతులు చెపుతున్నారు.



కొనుగోలుదారులు రాకపోవడంతో చెట్టకింద పడేసిన గుమ్మడికాయలు



ధర పతనం కావడంతో వదిలేసిన గుమ్మడి తోట

కాయలు తెంపి చెట్టు కింద పోశా..



నేను మూడు ఎకరాల్లో గుమ్మడి సాగు చేశాను. పంటకు సుమారు రూ.60వేలకు పైగా పెట్టుబడి వచ్చింది. డిసెంబరు, జనవరి నెలల్లో కిలో రూ.10 నుంచి 6 వరకు పలికిన ధర మార్చిలో రూ.2, 1లకు పడిపోయింది. పదిహేను, ఇరవై రోజులు ఎదురు చూసినా కాయలు కొనడానికి వ్యాపారస్తులు ఎవ్వరూ రాలేదు. దీంతో కాయలను పీకి పొలం పక్కన చెట్టు కింద పోశాను.

\- ధనుంజయరెడ్డి, గుమ్మడి రైతు, దేవరబురుజు

వ్యాపారులు రావడం లేదు



నేను 50 కుంటల్లో రూ.22 వేలు పెట్టుబడి పెట్టి తీపి గుమ్మడి సాగు చేశాను. ఒక్కో కాయ 4 నుంచి 8 కేజీల బరువుతో దిగుబడి చాలా బాగా వచ్చింది. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో కూడా దిగుబడులు రావడంతో డిమాండ్ పడిపోయింది., ఇరవై రోజుల నుంచి చూస్తున్నా కాయలు కొనడానికి వ్యాపారులే రావడం లేదు. దీంతో చేసేదేమీ లేక తోటను అలాగే వదిలేశా

\- గుమ్మడి రైతు, రామస్వామిరెడ్డి, బోరెడ్డివారికోట

ముదివేడు రికార్డింగ్ డ్యాన్సులపై ఎస్‌బీ విచారణకు ఆదేశం

- డ్యాన్సులకు వినియోగించిన ట్రాక్టర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

కురబలకోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పడమటి ప్రాంత మండలాల్లో ప్రసిద్ధి చెందిన ముదివేడు దండుమారెమ్మ జాతరలో జరిగిన అర్ధనగ్న నృత్యాలపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఎస్పీ స్పెషల్ బ్రాంచ్ పోలీసు అధికారుల ను ఆదేశించారు. ముదివేడు జాతరలో రికార్డింగ్ డ్యాన్సుల హోరు శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. రికార్డింగ్ డ్యాన్సులకు సంబంధించి వీడియోలను పలువురు వాట్సాప్ ద్వారా ఎస్పీకి పంపించారు. కాగా మండల పరిధిలోని మట్లివారిపల్లె, నడింపల్లె, గోళ్ళపల్లె, తూపల్లె, పరదేశిపల్లె, కోనంగివారిపల్లె గ్రామాల్లో మహిళలు, హిజ్రాలతో విచ్చలవిడిగా డీజే సౌండ్స్ నడుమ అర్ధనగ్న నృత్యాలను నిర్వహించారు. అయితే, నామమాత్రంగా ఒకటి, రెండు గ్రామాలకు చెందిన వాహనాల మీద మాత్రమే పోలీసులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. కాగా, శనివారం రికార్డింగ్ డాన్సులకు వినియోగించిన మరో ట్రాక్టర్‌ను సీజ్ చేయగా, వైసీపీకి చెందిన కొంతమంది నేతలు నిర్వాహకులపై కేసులు లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

మౌలా కా పహాడ్ దర్గాలో ఫాతెహా



ఇఫ్తార్ విందులో పెద్ద దర్గా గురువు ఆరిఫుల్లాహుస్సేనీ, దాసరిపల్లి జయచంద్రా రెడ్డి , దర్గా కమిటీ సభ్యులు తదితరులు

పెద్దమండ్యం, మార్చి22 (ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం కలిచెర్ల మౌలా కా పహాడ్ దర్గా లో శనివారం రంజాన్ 21వ ఉపవాస దినాన్ని పురస్కరించుకుని కడప అమీన్‌పీర్ పెద్ద దర్గా పీఠాధిపతి కెఎస్ఎస్ ఆరిఫుల్లా హుస్సేనీ ఫాతెహా నిర్వహించారు. ముందుగా దర్గాలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి, టీడీపీ సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్‌తోపాటు పలువురు అధికారులు, కూటమి నేతలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మదనపల్లి డీఎస్పీ కొండయ్య నాయుడు ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 8 మంది ఎస్‌ఐలు, 77 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొనట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు.


మంటల్లో పడి ఒకరి మృతి



చిన్నసుబ్బయ్య మృతదేహం

రామాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొండ కు నిప్పంటించబోయిన ఓ వ్యక్తి ఒంటికి మంటలంటుకుని మృతి చెందాడు. ఏఎస్‌ఐ వెంకటరమణ కథనం మేరకు.. మండలంలోని నల్లగుట్టపల్లి బీసీ కాలనీకి చెందిన గంప చిన్న సుబ్బయ్య (55) శుక్రవారం సాయంత్రం గుట్టకు నిప్పంటించేందుకని పొలం వద్దకు వెళ్లాడు. రాత్రయినా అతను తిరిగి ఇంటికి వెళ్లలేదు. కాగా, శనివారం ఉదయం కాలిపోయిన స్థితిలో ఉన్న అతని మృత దేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించారు. వారు సమాచారం అందించడంతో భార్య సుబ్బమ్మ అక్కడికి వెళ్లి మృతి చెందింది తన భర్తగా గుర్తించి రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీ సులు సంఘటన స్థలాన్ని సందర్శించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సుబ్బయ్య ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా, మద్యం మత్తు కారణంగానే మంటలంటుకుని అతను మృతి చెందినట్లు పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



లత మృతదేహం

మదనపల్లె అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. వలసపల్లె గ్రామం దిగువ కృష్ణాపురానికి చెందిన గణేష్ ప్రైవేటు వాహనాలకు డ్రై వర్‌గా పని చేస్తుంటాడు. 22 ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం, కోలార్ జిల్లా ములబాగల్‌కు చెందిన లత(38)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. కాగా, తల్లిదండ్రులు చనిపోవడంతో ముళబాగిలులో ఒంటరిగా ఉన్న తన అక్క కూతురును ఇంటికి తీసుకురావాలని శుక్రవారం రాత్రి లత భర్తను కోరగా, తనకు సమయం కుదరలేదని సమాధానమిచ్చాడు. దీంతో క్షణికావేశంతో చీరతో ఇంట్లోని కమ్మీకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుక్కల బారినుంచి జింకను కాపాడిన యువకులు



కుక్కలదాడిలో గాయపడిన జింక

నందలూరు,మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఓ జింకను కుక్కల బారి నుంచి స్థానికులు రక్షించారు. మండలంలోని నేషనల్ హైవే బైపాస్ పక్కన ఉన్న వరి పొలాల్లో శనివారం జింకను కుక్కలు తరుముతున్న విషయం కొంతమంది యువకులు గుర్తించారు. వెంటనే దానిని కాపాడి స్థానిక పోలీసుస్టేషన్‌కు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు జింకను స్వాధీనం చేసుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గొల్లపల్లెకు చెందిన యువకులు బడే తిమ్మయ్య, పవన్‌కుమార్, కొండయ్య, నందకుమార్, షమీవుల్లాలను స్థానికులు అభినందించారు.

హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ

కురబలకోట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేనేతనగర్‌లోని హార్డ్‌వేర్ దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. మండలంలోని అంగళ్లకు చెందిన నవాజ్ హార్డ్‌వేర్ దుకాణం పైకప్పు రేకులను కత్తిరించి లోనికి ప్రవేశించిన దుండగుడు రూ.25వేలు నగదు, కంప్యూటర్ మానిటర్‌ను ఎత్తుకెళ్లాడు. ఈ చోరీకి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

పీలేరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్సకే పరిమితవ్వాలని పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పీలేరు నియోజకవర్గంలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా చోట్ల ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఎంబీబీఎస్ వైద్యుల్లా అన్ని రకాల జబ్బులకు వైద్యం చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు రోగులకు ప్రథమ చికిత్స అందించి సమీప పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. అలా కాకుండా తమ పేర్ల ముందు డాక్టర్ అని పెట్టుకోవడం, నర్సింగ్ హోంలను నడపడం చట్టవిరుద్ధమన్నారు. జిల్లా డెమో అధికారి దేవశిరోమణి మాట్లాడుతూ చాలా మంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు రోగులకు సెలైన్ ఎక్కించడం, కాన్పులు, అబార్షన్లు చేయడం, దీర్ఘకాలిక వ్యాధులకు కూడా వైద్యం చేస్తున్నారన్నారు. అటువంటి వారికి చట్టంపై అవగాహన కల్పించేందుకు సదస్సు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో అటువంటి పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కలికిరి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ ప్రథమ చికిత్స అందించే విధానాలు, అందుకు వాడాల్సిన మందుల మోతాదుల గురించి వివరించారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా ప్రవర్తించే ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై నమోదయ్యే కేసుల గురించి తెలియజేశారు కార్యక్రమంలో తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్, హెచ్‌ఈ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పశు సంరక్షణ తప్పనిసరి

తంబళ్లపల్లె, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున పశువుల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తంబళ్లపల్లె పశుసంవర్ధక శాఖ ఏడీ సుమిత్ర సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో పశువులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. "ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటలపైన మాత్రమే పశువులను మేతకు బయటకు వదలాలన్నారు. మిగిలిన సమయాల్లో చెట్ల కింద నీడలో కాని, చుట్టూ చెట్లు ఉండే పాకల్లో కట్టేసి మేపడం చాలా మంచిదన్నారు. పొదుగు వాపు వ్యాధి రాకుండా పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎండ ప్రభావంతో పశువుల్లో పాల దిగుబడి, వెన్న శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. ఇందుకు ఆహారం అందించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు తాగినంతమేరకు శుభ్రమైన నీరు అందుబాటులో పెట్టాలన్నారు. ఎక్కువ శక్తినిచ్చే ఆహారం పచ్చి గడ్డి, దాణాలో మినరల్ మిక్చర్ కలిపి ఇవ్వాలన్నారు. విటమిన్ 'ఎ' ఇంజక్షన్‌ను ఒక పశువుకు 1గ్రాము చొప్పున నెలలో 5 సార్లు ఇవ్వాలన్నారు. ఒకవేళ పశువులకు వడదెబ్బ తగిలితే వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లి పశు వైద్యులను సంప్రదించి ఆయన పర్యవేక్షణలో సెలైన్ పెట్టి చికిత్స అందించాలన్నారు. పశువులపైన చల్లని తడి బట్టలను కప్పాలన్నారు. సెప్టెంబరు మాసం వరకు సూచించిన జాగ్రత్తలను పాటించాలని ఏడీ తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా!



అనిల్ మృతదేహం

కలకడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. సంబేపల్లి మండలం శెట్టిపల్లి పంచాయతీ కొత్త మాదిగపల్లికి చెందిన అనిల్ (20) శనివారం తన స్నేహితులతో కలిసి మండల పరిధిలోని ఝరికోనలో ఈదులాడుతూ నీటిలో మునిగి పోయాడు. అతని స్నేహితులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించినట్లు సమాచారం అందడంతో, పోలీసులు అక్కడికి వెళ్లి మృత దేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ వివరించారు. కాగా యువకుడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ కెమెరాల నిఘాతో నగదు రికవరీ



బాధితురాలికి నగదు అందజేస్తున్న పోలీసులు

రాయచోటిటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాయచోటికి చెందిన ఒక మహిళ ఆసుపత్రిలో తన పర్సు పోగొట్టుకొని శనివారం పోలీస్‌స్టేషన్‌కు రాగా, సురేంద్ర అనే కాని స్టేబుల్ సీసీ కెమెరాలు పరిశీలించి ఆమె పోగొట్టుకున్న నగదును రికవరీ చేశారు. ఈ సందర్భంగా సీఐ బీవీ చలపతి మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలందరూ తమ నివాసాలవద్ద సీసీ కెమెరాలు అమర్చుకుంటే అవి మీకు, మీ చుట్టుపక్కల వారికి భద్రత కల్పిస్తాయన్నారు. దుకాణదారులు, షాపుల యజమానులు, తదితరులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్ పేలి.. టీ దుకాణం ధ్వంసం



చికిత్స పొందుతున్న కృష్ణయ్య

కురబలకోట/మదనపల్లె, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్యాస్‌సిలిండర్ పేలి టీ దుకాణం ధ్వంసం కావడంతో పాటుగా దుకాణ యజమాని తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని అంగళ్ల బస్టాండ్ సమీపంలో కృష్ణయ్య(52) టీ దుకాణాన్ని నిర్వహిస్తుంటాడు. శనివారం ఉదయం టీ పెట్టేందుకు గ్యాస్ స్టౌ వెలిగిస్తుండగా, సిలిండర్ పేలింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆయనను 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి రెఫర్ చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ పరామర్శించాడు.

కొబ్బరి చెట్లపై పిడుగులు



పిడుగుపాటుతో మండుతున్న కొబ్బరి చెట్టు

రామసముద్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం చెంబకూరులో శనివారం సాయంత్రం పొలంలో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. చెట్టుపూర్తిగా కాలిపోయింది. దీనితో ఇంటిలోని వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఎవరికి అపాయం కలుగలేదు. మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రంలో శనివారం సాయంత్రం భారీ ఉరుములు, మెరుపులు సంభవించాయి. విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో ఉన్న బొక్కసం శివయ్య పంటపొలాల్లోని కొబ్బరిచెట్టు మీద పిడుగుపడడంతో పాక్షికంగా కాలిపోయింది. ఆ ప్రదేశంలో జనసంచారం లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని గ్రామస్తులు తెలిపారు.

ఎస్టీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), మార్చి22(ఆంధ్రజ్యోతి): ఎస్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్టీ ట్రైబల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి ఏడీ సురేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి, కేవీపల్లి, పీలేరుల్లో ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి 5, 6, 7, 9 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తామని, అందులో అర్హత సాధించిన విద్యార్థులకు మాత్రమే సీట్లు కేటాయిస్తామని తెలిపారు. రాయచోటి పాఠశాలలో 5వ తరగతికి 80 సీట్లు, 6వ తరగతి 39 సీట్లు, 7 తరగతికి 6 సీట్లు, కేవీపల్లి ఎస్టీ గురుకులంలో, పీలేరు గురుకుల పాఠశాలలో 5వ తరగతికి 80, 6వ తరగతికి 64, 7వ తరగతికి 55, 8వ తరగతికి 46, 9వ తరగతికి 46 సీట్లు ఉన్నాయని వివరించారు. పాత జిల్లాలోని విద్యార్థులు కూడా ఆన్‌లైన్ ద్వారా ఈనెల 25 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఈ 9441146908, 7382264994 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

కస్తూరిబా బాలికా విద్యాలయంలో..

సిద్దవటం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలోని 17 మండలాల్లో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అకాడమీ మానిటరింగ్ అధికారి వీరేంద్ర తెలిపారు. శనివారం ఆయన సిద్దవటంలో మాట్లాడుతూ జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి నిత్యానందరాజు ఆదేశాల మేరకు కేజీబీవీలో 6 నుంచి ఇంటర్ వరకు చదివేందుకు అర్హులైన బాలికలు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వంద శాతం సీట్ల భర్తీ కోసం ఎంఈవోలు, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు.

విశ్వవిద్యాలయం తల్లిలాంటిది


- వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయం తల్లిలాంటిదని వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం విశ్వవిద్యాలయంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాల్లో ఆచార్యులు, సహాయ ఆచార్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, ఆచార్యులు, సహ, సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

మైనర్లకు బైక్ ఇస్తే తల్లిదండ్రులే బాధ్యులు

పులివెందుల రూరల్,మార్చి 22 (ఆంధ్రజ్యోత): మైనర్లకు బైక్ ఇస్తే తల్లిదండ్రులను బాధ్యులుగా చేర్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ హాజీవలి హెచ్చరించారు. శనివారం పట్టణంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీనాయక్ ఉత్తర్వులపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలో మైనర్లు నడుపుతున్న వాహనాలను సీజ్ చేశారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. నూతన చట్టాల గురించి వివరించారు.

ఇడుపులపాయలో వర్షం



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో కురుస్తున్న వర్షం

వేంపల్లె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ఎండలు మండుతున్నాయి. వేసవి తాపం రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో హఠాత్తుగా ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. ట్రిపుల్‌ఐటీ చుట్టుపక్కల జల్లులు కురిశాయి. ఇడుపులపాయ కొండలు మేఘావృతం అయి కనిపించాయి. సుమారు పది నిమిషాల పాటు వర్షం కురవడంతో విద్యార్థులు, ఉద్యోగులు వర్షంలో తడుస్తూ కేరింతలు కొట్టారు. పది నిమిషాల తర్వాత వాతావరణం యథాస్థితికి చేరుకుంది.



ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రాలో ద్వితీయ, తృతీయ విజేతలను ఎంపిక చేస్తున్న హరిప్రసాద్, తుంగా రమణయ్య

ఆంధ్రజ్యోతి లక్కీడ్రా విజేతలు వీరే..

మొదటి బహుమతి	
గిద్దలూరు తన్మయి, ప్రొద్దుటూరు	8374863607
రెండో బహుమతి	
ఎం.వి.శ్రీనాథ్, వేంపల్లి	8008405406
మూడో బహుమతి	
ఎస్.భవాని, బద్వేల్	8688605619
కన్సోలేషన్ బహుమతులు	
1) ఎం.రంగనాయకులు, కడప	9705632285
2) యు. వేదవ్యాస, రాజంపేట	9703519147
3) వి.శ్రీనివాసులు, రాయచోటి	7780697912
4) ఆర్. ఉమాదేవి, కడప	7780515748
5) ఎం. ఆకాశ్, కడప	9000873473
6) ఎస్. ప్రాప్తి, కడప	7207203698
7) వి.నాగేంద్ర, సిద్దవటం	9177032658
8) వైవీఎస్ శివప్రసాద్, కడప	9949838496
9) ఎ.సుజాత, కడప	9154448118
10) జె.సునీల్‌కుమార్, పోరుమామిళ్ల	9849937577
11) వి.నాగభూషణం, కడప	7981812106
12) ఎం.నాగలక్ష్మి, రామాపురం	8074137108
13) పూల ప్రమీళ, చక్రాయపేట	9347116852
14) ఎస్.ఉమామహేశ్వర్, లక్కిరెడ్డిపల్లె	9949564682
15) పి. కవిత, వేంపల్లి	6302656629
16) ఎస్.వి.రమణ, కడప	8500026226
17) మధుసూదన్, కమలాపురం	9959513937
18) ఎం.మూక్షిత, కడప	9989233432
19) సి.మహమ్మద్‌రఫి, కమలాపురం	9912870201
20) సి. ఆదిలక్ష్మి, వేముల	9618915805
21) ఆర్.శివకుమార్, కడప	8464027375
22) గూడూరు రామమూర్తి, కడప	8333021405
23) పి. మహేష్ కుమార్, కడప	9949192922
24) వి.ఎల్.కిషోర్‌కుమార్‌రెడ్డి, కడప	9441636160
25) కె.రాజేశ్వరి, కడప	9849401992
26) ఎస్.రమేష్‌బాబు, కడప	9618942369
27) పి.చంద్రశేఖర్, జమ్మలమడుగు	9703838148
28) జె. తారకరామ, కడప	9000288884
29) బాబు, కమలాపురం	9701724588
30) జి. లక్ష్మణ్, కడప	7997992717
31) శ్రీకాంత్, కమలాపురం	8498886636
32) కె.వెంకటరమణ, యర్రగుంట్ల	9705495108
33) పి.మహాలక్ష్మి, మాధవరం	7671835359
34) దామోదర్‌రెడ్డి, కమలాపురం	6305638157
35) పి.హరిప్రసాద్, జమ్మలమడుగు	9966709390
36) వి. తేజ, ఎస్.ఆర్.పల్లె	9912633015
37) ఎస్.విజయలక్ష్మి, కడప	8341077048
38) ఆర్.హరిత, కడప	9494237418
39) జె.గంగాదేవి, ప్రొద్దుటూరు	9581818259
40) కె.భాస్కర్‌రెడ్డి, సిద్దవటం	9502744931
41) జె. కుళ్ళాయమ్మ, మైదుకూరు	7680984978
42) ఎస్.మహబూబ్ హుస్సేన్, పోరుమామిళ్ల	9441761348
43) ఎం.భూతేశ్వర్, మైదుకూరు	9440280716
44) కె.అలివేలమ్మ, ముద్దనూరు	9666953997
45) ఎస్. కరుణశ్రీ, కడప	9951564823
46) ఎన్. రత్నమ్మ, ప్రొద్దుటూరు	9701281797
47) సి.వరకుమార్, కడప	9441739846
48) బి.లక్ష్మీదేవి, ప్రొద్దుటూరు	9491360164
49) కె.సుమన్, కమలాపురం	9849996355
50) ఎస్.మహమ్మద్ ఆషం, పోరుమామిళ్ల	9491426068
51) మూర్తి నరసింహులు, కడప	9490008935
52) ఎం.నయీముల్లా, చెన్నూరు	8500231272
53) ఎం.అమీర్‌బాష, వనిపెంట	9908764493
54) డి.మాన్విక, ముద్దనూరు	9032398630
55) ఎ.భారతి, జమ్మలమడుగు	9247336615
56) ఎం.వెంకటరాజేశ్వరి, ప్రొద్దుటూరు	9441000724
57) శ్రీపెంచల ట్రేడర్స్, రైల్వేకోడూరు	9985635112
58) జింకా శ్రీలక్ష్మి, కడప	7569911558
59) బి.లక్ష్మిచెన్నకేశవ, ప్రొద్దుటూరు	7013041486
60) ఆవుల మహమ్మద్ రఫి, టి.ప్రొద్దుటూరు	9110740959
61) ఎం. హరేంద్రారెడ్డి, ప్రొద్దుటూరు	6380221278
62) పాణ్యం రిహాన్సినిశ్చయ, కలసపాడు	8341113840
63) టి.ఎస్.బాబావక్రుద్దీన్, ముద్దనూరు	9010323166
64) కె. మల్లిఖార్జునరెడ్డి, కడప	9440232689
65) టి. కవిత, ప్రొద్దుటూరు	8106927243
66) కె.వెంకటదుర్గ, కడప	8639613938
67) జిగిలేటి రత్నమ్మ, మైదుకూరు	8008186605
68) కె.శ్యామ్‌లీలాకృష్ణ, కడప	9059527153
69) ఆర్.నాగమణెమ్మ, జమ్మలమడుగు	7416693008
70) జి.బాలకుమార్, చెన్నూరు	8328189309
71) కె.వెంకటేశ్వర్లు, రాజంపేట	9441739026
72) ఎ.జగన్నాథం, ప్రొద్దుటూరు	8143944924
73) కె.ఏ.ప్రసాద్‌రెడ్డి, చిన్నకొమెర్ల	7842623565
74) జి.రంగయ్య, జమ్మలమడుగు	8978663906
75) ఏ.ఉష, కడప	7396827983
76) ఒన్నూరు లక్ష్మియువరాజ్, పోరుమామిళ్ల	9550939831
77) ఇ. వెంకటేశ్, బద్వేల్	9440622815
78) బి.శ్రీను, కమలాపురం	9398047021
79) గాజుల పీరయ్య, కడప	8297237121
80) సూర్యకృష్ణయ్య, దువ్వూరు	7386750646
81) వై.శివదుర్గాదేవి, పులివెందుల	9030204532
82) జి.సత్యనారాయణ, కడప	9052032443
83) కె.కృష్ణమూర్తి, కడప	9440678576
84) ఎల్. కృష్ణచైతన్యరెడ్డి, రాయచోటి	9951813262
85) కె.కొండయ్య, వేపరాల	9492371189
86) టి.లక్ష్మీదేవి, కడప	9966624720
87) పి.నాగేశ్వరరావు, కడప	9394044477
88) కె.లక్ష్మినరసయ్య, యర్రగుంట్ల	9490606297
89) పి.సుబ్బలక్షుమ్మ, దువ్వూరు	9985312340
90) ఇ.పార్వతి, చిన్నమాచుపల్లి	9550323490
91) సి.కృష్ణకుమారి, ప్రొద్దుటూరు	9493352409
92) బి.పుల్లయ్య, మైదుకూరు	9885576626
93) ఎం.లక్షుమ్మ, చాపాడు	8008085417
94) బి.సుబ్బారాయుడు, సిద్దవటం	8142308345
95) ఎస్.గురువయ్య, బి.మఠం	8106122101
96) వై.శ్రీనివాసులు, కడప	9398900341
97) ఎస్.గంగాధర్, సి.కె.దిన్నె	8374710727
98) కె.నాగసుప్రజ, కడప	6300235069
99) ఆర్.సునీల్‌కుమార్, కమలాపురం	9666463248
100) టి. అశోక్‌కుమార్, కడప	9949253622

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే..
భారీ మూల్యం చెల్లించాల్సిందే

● సెల్‌ఫోను డ్రైవింగ్, నో డ్రైవింగ్ లైసెన్స్‌కు రూ.10వేలు ● మైనర్లు డ్రైవింగ్ చేస్తే.. కౌన్సెలింగ్‌తో పాటు జరిమానా



కడప క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగు తున్నాయి. ఈ ప్రమాదాల్లో పెద్ద చిన్న తేడా లేకుండా ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా యువత ఎక్కువగా ప్రమాదాల్లో మృత్యువాత పడుతూ కన్న తల్లిదండ్రులకు కడుపు కోత మిగిలిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రోడ్డు నిబంధనలు పాటించని వారికి ఈ నెల 1వ తేదీ నుంచే భారీగా జరిమానాలు విధించేందుకు నిర్ణయించిది. దీనిపై రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనదారులందరికీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అలాగే ఫ్లెక్సీల ద్వారా ఆటోలకు స్టిక్కర్లు అతికించి అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతానికి హెల్మెట్, రాంగ్ పార్కింగ్, సెల్‌ఫోను డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్‌లకు సంబంధించి ఇప్పటి వరకు విధిస్తున్న జరిమానాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇకపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారుడు భారీ మూల్యం చెల్లించు కోవాల్సిందే. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంటు రంగంలోకి దిగనుంది. కేంద్రప్రభుత్వం అమోదించిన కొత్త మోటరు వెహికల్ చట్టం రూపొందించిన జరిమానాలను అమలు చేయడానికి సిద్ధమవుతున్నారు.

రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మారుద్దాం...



కడప క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహ కరించాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ప్రజలకు సూచించారు. శనివారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు, ఎంవీ యాక్ట్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. హెల్మెట్, సీటుబెల్టు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. గ్రామాల సందర్శన సమయంలో నిర్వహించే గ్రామ సభల్లో రోడ్డుభద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే..

కొంత మంది యువత స్పోర్ట్స్ బైకులతో రోడ్లపై ఇష్టానుసారంగా వేగంగా నడుపుతున్నారు. వీరు ప్రమాదాలకు గురి కావడమే కాకుండా ఎదుటి వారి ప్రాణాలను బలిగొంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి ఒకేసారి రూ.10వేలు జరిమానా విధించనున్నారు.

● డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపితే రూ.5వేల నుంచి 10వేల వరకు జరిమానా తప్పదు.

● హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే రూ.వెయ్యి, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేకుండా నడిపితే మొదటిసారి రూ.2వేలు, రెండోసారి పట్టుబడితే రూ.4వేలు జరిమానా తప్పదు.

● పొల్యూషన్ ధ్రువపత్రం లేకుంటే రూ.1500, వాహన డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోను వాడితే రూ.1500 మొదటిసారి, రెండోసారి రూ.10వేలు జరిమానా తప్పదు.

● ఆటోడ్రైవర్లు యూనిఫాం లేకుండా మొదటిసారి అయితే రూ.150, రెండోసారి అయితే రూ.300 తప్పదు.

● సీటు బెల్టు ధరించకుండా వాహనం నడిపితే డ్రైవరుకు రూ.వెయ్యి, ప్రయాణికుడికి మరో వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తారు.

● వాహనాలు రిజిస్ట్రేషన్ లేకున్నా, ఫిట్‌నెస్ లేకండా వాహనం నడిపితే రూ.2వేలు మొదటిసారి, రూ.5వేలు రెండోసారి జరిమానా తప్పదు. త్రిబుల్ రైడింగ్‌కు రూ.వెయ్యి జరిమానా తప్పదు అంటూ... పెరిగిన చార్జీలకు సంబంధించి సమాచారం వాహనదారులకు కడప ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తూ వస్తున్నారు.

మార్పు వచ్చేనా.

వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు తెలిసినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది తల్లిదండ్రులు మైనర్లు అయిన వారి బిడ్డలకు వాహనాలు ఇస్తు న్నారు. ఒక వేళ పోలీసులు పట్టుకున్నా మైనరే కాబట్టి కౌన్సెలింగ్ చేస్తూ వస్తున్నారు. ఇకపై అలా కాకుండా మైనర్లు పట్టుబడితే మొదట కౌన్సెలింగ్, తరువాత కేసులు నమోదు చేయనున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం.



కొత్త జరిమానాలపై ప్రతి వాహనదారుడికి అవగాహన కల్పించే లా ఫ్లెక్సీలను, ఆటోకు స్టిక్కర్లను అతికిస్తున్నాం. కొన్ని సర్కిళ్లలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం నిబంధనలు పాటించని వారికి కొత్త జరిమానాలు వేయకుండా అవగాహన కల్పిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో కొత్త జరిమానాలు వేయనున్నాం. వాహనదారులతో పాటు వారి కుటుంబ సభ్యులకు అవగాహనకల్పిస్తూ పోలీసులకు సహకరించాలని కోరుతున్నాం.

-జావేద్, కడప ట్రాఫిక్ సీఐ

మండలిలో కడప జిల్లా సమస్యలపై ప్రజాగళం

● ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి (ఫైల్)

కడప ఎడ్యుకేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి సమావేశంలో కడప జిల్లా సమస్యలపై ప్రజల పక్షాన ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ప్రజాగళమయ్యారు. పలు సమస్యలపై సభలో ప్రస్తావించి... ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా కడప రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను రెండేళ్ల క్రితం కేంద్ర మంత్రి ప్రారంభించినప్పటికీ ఇంత వరకు కొన్ని ప్రాంతాలలో అటవీశాఖ అనుమతులు లేవని ప్రారంభించ లేదన్నారు. వెంటనే పనులు ప్రారంభించి రోడ్డును త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి జనార్దనరెడ్డి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి త్వరలో పనులు ప్రారంభిసామని తెలిపారని వివరించారు. అలాగే కడప పట్టణంలో సీపీ బ్రౌన్ లైబ్రరీకి సంబంధించి గత ప్రభుత్వంలో అదనపు గదుల నిర్మాణం కోసం రూ.6.80కోట్లు మంజూరయ్యాయన్నారు. అధికారులు పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారని.. వెంటనే ఆ పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్టను టూరిజం కేంద్రంగా మార్చి అక్కడున్న చెరువులో బోట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కడప సుందరీకరణలో భాగంగా బుగ్గవంక వాల్ వెంబడి 8కిలోమీటర్ల రోడ్డు వేయాల్సి ఉన్నప్పటికి ఇప్పటికి 3కిలోమీటర్లు మాత్రమే పూర్తయిందని మిగిలిన 5 కిలోమీటర్లు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. అలాగే కమలాపురం-కడప మధ్యలో ఉన్న పాపాఘ్ని నదిపై నిర్మించిన కొత్త వంతెన నిర్మాణం కొంత భాగం పెండింగ్ ఉందని.. త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చెల్లిస్తామని చెప్పినా.. 9నెలలు కాలం గడుస్తున్నప్పటికి ఇవ్వ లేదన్నారు. 12వ పీఆర్సీని ప్రకటించాల్సిందిగా కోరారు. ఉద్యోగస్తులకు, పోలీసులకు ఇవ్వాల్సిన డీఏ, ఐఆర్ మరియు జీపీఎఫ్‌ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సామాజిక సమస్యలపై ప్రైవేటు, ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రస్తావించినట్లు తెలిపారు.

రాయలసీమ గ్రామీణ జీవితాన్ని
పాలగిరి కథలు ఆవిష్కరించాయి

● నల్లరేగడి నేలల్లో కథల సంపుటి ఆవిష్కరణ సభలో వక్తలు



నల్లరేగడి నేలల్లో కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయితలు ప్రముఖులు

ప్రొద్దుటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ గ్రామీణ జీవితాన్ని పాలగిరి విశ్వప్రసాద్ కథలు ఆవిష్కరించాయని కథా రచయితలు సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, వేంపల్లి షరీఫ్‌లు కొనియాడారు. చికాగో సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ప్రముఖ కథా రచయిత దాదాహయాత్ అధ్యక్షతన స్థానిక వసంతపేటలోని తొగవీరక్షత్రియ కల్యాణ మండపంలో పాలగిరి విశ్వప్రసాద్ రచించిన నల్లరేగడి నేలల్లో అనే కథ సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కథలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాయలసీమలో ముఖ్యంగా కడప జిల్లాలోని పెన్నానదీ తీరంలోని గ్రామీణ జీవితాలను కథలుగా అక్షరీకరించారన్నారు. ప్రధానంగా విశ్వప్రసాద్ తన కథల్లో పాత్రలను సజీవంగా ఉంచేలా చూస్తారన్నారు. కథల్లో ఆయన వాడిన కడప జిల్లా పెన్నాతీరాన వున్న గ్రామీణ ప్రజల భాషా నుడికారాన్ని అద్భుతంగా పట్టుకున్నారన్నారు. ఆయన రాసిన చుక్కపొడిచింది కథ ఎప్పటికి గుర్తుండిపోతుందన్నారు. చరిత్రలో గొప్ప కథలుగా చెప్పుకున్నవన్నీ స్త్రీల జీవితాలే అయివుంటాయన్నారు. విశ్వప్రసాద్ కూడా స్త్రీల జీవితాలను చాలా లోతుగా పరిశీలించి రాశారన్నారు. రాయలసీమ నుంచి కథలు రాస్తే ప్రచురించని దశనుంచి ఆధునిక కథా సాహిత్యానికి రాయలసీమ కథలే ప్రాధాన్యతను సంతరించుకున్నాయన్నారు. సమావేశంలో మెట్టుపల్లి జయదేవ్, కథా రచయిత కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, శతావధాని నరాల రామారెడ్డి, కవి బసవరాజు, వేణుగోపాల్, చంద్రమౌళీశ్వరరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, రామ య్య, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను నమ్మించి..
చోరీలకు పాల్పడే దొంగ అరెస్టు

ఎర్రగుంట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధులను నమ్మించి దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎర్రగుంట్ల అర్బన్ సీఐ నరేష్ బాబు వివరాల మేరకు.. ఖాజీపేటకు చెందిన ఖాసీంపీరా మట్కా, క్రికెట్ బెట్టింగులు ఆడుతూ అప్పులపాలయ్యాడు. అప్పులిచ్చిన వారు ఒత్తిడి ఎక్కువ కావడంతో.. ముసలివారిని నమ్మించి బంగారు చోరీచేసేవాడు. ఈ నేపథ్యంలో మార్చి 9వ తేదీ చిన్నమాచుపల్లెకు చెందిన మహబూబ్‌బీ అనే వృద్ధురాలితో మీ కోడలు బంధువునంటూ నమ్మించి చేతిలోని ఉంగరం చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం ఎర్రగుంట్ల ఎస్‌బీఐ వద్ద దొంగను అరెస్టు చేసి.. కోర్టుకు హాజరు పరచినట్లు సీఐ తెలిపారు.

హాకీకోచ్‌పై దాడి.. కేసు నమోదు

పులివెందుల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పులివెందుల హాకీ అకాడమీలో కోచ్‌గా పనిచేస్తున్న రవిపై స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి శేఖర్ దాడి చేశారు. ఈ మేరకు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు పేర్కొన్నారు. వివరాల మేరకు... హాకీ గ్రౌండ్‌లో శిక్షణ ముగిసిన అనంతరం విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లేందుకు కొందరు తల్లిదండ్రులు అక్కడకు వచ్చారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోకి ఎందుకు పేరెంట్స్‌ను రానిచ్చావని రవిపై శేఖర్ చిందు లేశాడు. దీంతో రవి పేరెంట్సే శిక్షణ ఎలా ఉందని అడిగి తెలుసుకునేందుకు వచ్చారని సమాధానమిచ్చారు. అక్కడ నుంచి రవి పైఅధికారులకు విషయాన్ని వివరించారు. ఇంతలో శేఖర్ అక్కడకు వచ్చి పక్కనే ఉన్న హాకీస్టిక్‌తో రవిపై దాడి చేసి చేతిపై, కాలిపై బ్యాట్‌తో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. శేఖర్‌కు 41 నోటీసు అందించి విచారించి అరెస్టు చేసినట్లు తెలిపారు.

చెట్టుపై పిడుగు... చెలరేగిన మంటలు



ముద్దనూరు మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో అకాల వర్షం పడింది. సాయంత్రం 4గంటల నుంచి భారీగా ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షం కురిసింది. దీంతో రోడ్ల పై వర్షపు నీళ్లు ప్రవహించాయి. కాగా చింతకుంట గ్రామంలో పొలాలలోని టెంకాయ చెట్టుపై పిడిగు పడటంతో మంటలు చెలరేగాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపో వడంతో ఎటువంటి ప్రమాదం జరుగలేదు.

వైవీయూ వసతిగృహాల తనిఖీ

కడప ఎడ్యుకేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం వసతి గృహాలను ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు శనివారం మధ్యాహ్నం అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల డైనింగ్ హాల్, కిచెన్, ఆహార పదార్థాల తయారీని ప్రత్యక్షంగా పరిశీలించారు. భోజనం, కూరలు రుచికరంగా ఉన్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ రఘునాథ్‌రెడ్డితో కలిసి భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. కిచెన్ నిర్వహణ అత్యంత పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు.

ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా చిన్నపరెడ్డి



ఇంటాక్ నూతన చైర్మన్, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిని అభినందిస్తున్న పూర్వ చైర్మన్ గుప్త

కడప ఎడ్యుకేషన్, మార్చి 22: భారతీయ జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా కడప ఇంటాక్ చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఎన్నికయ్యారు. ఈనెల 21న న్యూఢిల్లీలోని లోధి ఎస్టేట్‌లో ఓట్ల లెక్కింపు జరిగింది. ఇదు లో చిన్నపరెడ్డికి మంచి మెజార్టీ లభించడంతో ఆయనను ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. విభజన అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ గవర్నింగ్ కౌన్సిల్‌కు తెలు గు వ్యక్తి సభ్యుడిగా ఎన్నిక కావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

జాతీయ డ్రైవర్ల కమిషన్ ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జాతీయ డ్రైవర్ల కమిషన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆల్ ఇండియా సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అన్వర్‌బాష, కార్యదర్శి మహ్మద్‌బాష కేంద్రప్రభుత్వాన్ని కోరారు. డ్రైవర్ల భవిష్యత్తు కోసం ఆల్ ఇండియా సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం న్యూ ఢిల్లీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాటాడుతూ దేశవ్యాప్తంగా కుటుంబ పోషణ నిమిత్తం పలు వాహనాల డ్రైవర్లు పొట్ట చేతపట్టుకుని రోడ్లపై వాహనాలు నడుపుతున్నారన్నారు. వారంతా తిరిగి సురక్షితంగా ఇంటికి చేరతారనే గ్యారంటీలేని జీవితాలను గుడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ల కుటుంబాల పోషణకు వీలుగా ప్రత్యేకంగా జాతీయస్థాయిలో డ్రైవర్ల కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఎన్‌ఎల్‌ఎస్‌ఏ పథకాలపై అవగాహన అవసరం : జడ్జి

కడప రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవాధికార సంస్థ అమలు చేస్తున్న పథకాలపై పారాలీగల్ వాలంటీర్లు అవగాహనను పెంపొందించుకొని క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూడాలని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబావక్రుద్దీన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో పారాలీగల్ వాలంటీర్లకు ఎస్‌ఎల్‌ఎస్‌ఏ పథకాలు, చట్టాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పారాలీగల్ వాలంటీర్లు పథకాల ప్రయోజనాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. అలా గే ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మాట్లా డుతూ ప్రతి ఒక్కరు నీటిని అవసరం ఏరకు వినియోగించాల న్నారు. ట్రైనీ న్యాయమూర్తులు ఎం.చంద్రశేఖర్, కె.సురేంద్రనాడ్, పి.తేజసాయి, చీఫ్‌లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.హరిబాబు, పారీలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న సాయి మహేశ్, నిర్వాహకులు

కడప, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రాబిట్ ఫిట్‌నెస్ సెంటరు అధినేత తుమ్మలూరు సాయిమహేశ్ తండ్రి వెంకటసుబ్బయ్య, తల్లి పద్మావతమ్మ జ్ఞాపకార్థం శనివారం రిమ్స్‌లో హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వైద్య చికిత్సల కోసం రిమ్స్‌కు వచ్చిన రోగులు, బంధువులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాబిట్ ఫిట్‌నెస్ సీఈవో సాయిమహేశ్, ఫౌండేషన్ అధ్యక్షురాలు విజయ లక్ష్మి, ఆర్టీసీ కానిస్టేబుల్ రవిరెడ్డి, లక్ష్మణ్, పురుషోత్తం, వెంకటసురేశ్‌బాబు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన వైసీపీ నేత సతీష్‌రెడ్డి

కడప క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అశోక్‌కుమార్‌ను శనివారం సాయంత్రం వైసీపీ నేత సతీష్‌రెడ్డి ఎస్పీబంగ్లాలో కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హత్య సినిమా సంబంధించి సెన్సార్ బోర్డు అనుమతిచ్చిందని అయితే కొన్ని క్లిప్పింగులు పోస్టు చేశారంటూ వైసీపీ కార్యకర్త పవన్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నార న్నారు. అయితే ఆ సినిమాను పోస్టింగులు చేయడం తప్పేముందన్నారు. చిన్న చిన్న విషయాలకు అమాయాకులను తీసుకురావడం సరికాద న్నారు.ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

గ్రామాల్లో 'దేవర్ల'సందడే..సందడి

వల్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాదికి ముందు వచ్చే ఆదివారం రోజు ఈ దేవర పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. దీంతో గ్రామాల్లో తమ బంధువులను పిలిపించి సందడి చేసుకుంటారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని గ్రామాల్లోని ప్రజలు చందాలు సేకరించి ఒక గ్రూపుగా ఏర్పడి ఈ దేవర పండుగను కలిసికట్టుగా చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఒక కమిటీని ఏర్పాటుచేసి పండుగ వైభవంగా నిర్వహి స్తారు.





కొప్పోలిలో విద్యుత్ అలంకరణలో గంగమ్మ ఆలయం, ఇందిరానగర్‌లో అన్నదానం చేస్తున్న పుత్తా నరసింహారెడ్డి

అందులోభాగంగా ఇప్పటికే అన్ని గ్రామాల్లో దండోరాలు వేయించి పండుగ నిర్వహించుకునేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. దేవర రోజున గ్రామాల్లోవిద్యుద్దీపాల్లో గ్రామమంతా నిర్వహించుకునేందు కు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఇంట్లో తమ బంధువులు, ఆత్మీయులను పిలిపించుకుని గ్రామ దేవతకు ముందురోజు చల్ల ఏర్పాటు చేస్తారు. ప్రతి ఇంటి నుంచి బోనం పట్టుకెళ్లి గంగమ్మకు బోనాలు సమర్పిస్తారు. అలాగే మండల పరిధిలోని కొప్పోలు గ్రామంలో 45 ఏళ్ల తరువాత దేవర పండుగను నిర్వహించుకునేందుకు ఆ గ్రామ యువత ముందుండి సన్నాహాలు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమా లు, పల్లె కట్టుబాట్లకు సంబంధించిన వివిధ కార్యక్రమాలతో పాటు గ్రామోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లలో యువత సన్నద్ధమయ్యారు, కొప్పోలినే కాకుండా సి.కొత్తపల్లె,లింగాయపల్లె, గంగాయపల్లె, తదితర గ్రామాల్లో ఈ దేవరను నిర్వహించనున్నారు.

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నె మండలం ఇందిరానగర్ నడివీధి గంగమ్మ తల్లిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి శనివారం దర్శించుకున్నారు. నడివీధి గంగమ్మ జాతర సందర్భంగా మూడు రోజులుగా అమ్మవారికి గ్రామస్థులు చల్ల పోస్తున్నారు. శనివారం అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీవీ క్రిష్టారెడ్డి, గంధం మోహన్‌బాబు, శివశంకర్, గంగిరెడ్డి, శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు.

నేడు చెన్నూరు గంగజాతర

చెన్నూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో గ్రామ దేవత గంగమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం నిర్వహిస్తున్న గంగ జాతరకు గంగమ్మను నిలిపే ప్రాంతంలో చలువ పందిర్లు, విద్యుత్‌లైటింగ్‌తో పాటు ప్రవేశద్వారాలను ఏర్పాటు చేశారు. అలాగే జాతర నాడు ఎలాంటి ఇబ్బందులు రాకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయించినట్లు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. జాతర మొత్తం తెల్లవారుజామున 2గంటల నుంచి అర్ధరాత్రి 12 వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చెన్నూరు. కడప పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందంతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వీసీని కలిసిన పలువురు

కడప ఎడ్యుకేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావును శనివారం టీడీపీరాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, వైవీయు పూర్వ పాలక మండలి ఎస్.గోవర్ధన్‌రెడ్డి కలిశారు. శాలువతో సత్కరించారు.

ఏఎఫ్ఏయూ వైస్ చాన్సలర్..: వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావును వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య విశ్వనాథకుమార్, కులసచివులు ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

నాన్‌టీచింగ్ సంఘం..: వైవీయూ వైస్ చాన్సలర్ చాంబర్‌లో శనివారం నూతనంగా ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును వైవీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో నాన్-టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లం రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణంలోని బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన మహిళ లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ కడప ద్వారా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామని దీనికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ శనివారం తెలిపారు. అర్హత కలిగిన సభ్యులు ఆధార్, రేషన్ కార్డుతో పాటు కులధృవీకరణ పత్రంతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. 18 -50 సంవత్సరాలు గల వారు కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులన్నారు. అనంతరం సర్టిఫికెట్లతో పాటు కుట్టుమిషన్‌లు ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు.

నీటి వృథాను అరికట్టాలి

పులివెందుల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను గుర్తుంచుకొని నీటి వృథాను అరికట్టాలని పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్రసాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ సూచించారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలను శనివారం కళాశాలలో నిర్వహించారు. ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన సాహిత్య పోటీలలో గెలుపొందిన విద్యార్థినిలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నివేదిత, అరుణ, డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ జయమ్మ, డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయశ్రీనివాస్, ఎన్‌వీ సుబ్బారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విధులు నిర్వహించాలి

లింగాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి అన్నారు. లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధిహామీ పనులపై జరిగిన 18వ విడత సామాజిక తనిఖీపై ఓపెన్ ఫోరం నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ రామలింగేశ్వరరెడ్డి, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భజలాలు పెంపొందించుకోవాలి

కడప(వినాయకనగర్), మార్చి22 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలను పెంపొందించుకోవాలని భూగర్భజలశాఖ ఏడీ కరీముల్లాబాషా తెలిపారు. స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాలలో శనివారం ప్రపంచ జలదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నీటి సంరక్షణ, అవసరం, ఆవశ్యకత మొదలైన అంశాలు విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శివరామక్రిష్ణ పాల్గొన్నారు.

27న ఉప సర్పంచ్ ఎన్నిక

కమలాపురం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోగటం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్‌డీ కెజియాఒక ప్రకటనలో తెలిపారు. కోగటం 10వ వార్డుమెంబరుగా ఉండి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన నాగ ప్రసాద్‌రెడ్డి గత ఏడాది వివిధ కారణాల రీత్యా తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 27న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులిచ్చింది.

'వేంపల్లి సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోండి'

కడప కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వేంపల్లి సబ్ రిజిస్ట్రార్‌పై సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గల పలు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు శనివారం వారు స్థానిక జిల్లా స్టాంప్స్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ ప్రసాద్‌రావును కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వీఆర్‌వో కె. సి. నాగసుబ్బారెడ్డి, కె.సమరసింహారెడ్డి, డి.మల్లేసు, మాజీ ఎంపీటీసీ వై. వెంకటేసు, ఎద్దుల వేమనారాయణ, టి. రాజశేఖర్‌రెడ్డి, వై. శేషారెడ్డి, వై. నాగేష్‌రెడ్డి, జి. వాసుదేవరెడ్డి, టి. గంగయ్య తదితరులుపాల్గొన్నారు.

ఎస్సీ హోదా కల్పించడం హర్షణీయం

కడప మారుతీనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగాల వర్గీయులకు ఎస్సీ హోదా కల్పించేలా కేబినెట్‌లో చర్చించి ఆమోదింప చేయడం హర్షణీయమని బేడ బుడగజంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దూపం రాజు కొనియాడారు. ఇందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం రియాజ్ థియేటర్ సమీప బేడ బుడగజంగం కాలనీలో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట ఉపాధ్యక్షు డు టి. కొండయ్య,డి. శ్రీరాములు, రాజుకాలనీ నివాసులు పాల్గొన్నారు.

వెలిగల్లు నుంచి పాపాఘ్ని నదికి నీరు వదలాలి



వినతిపత్రం అందిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటి సమస్య తీవ్రతరమవుతోంది. పాపాఘ్ని నదిలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేయడం వల్ల భూగర్భజలాలు అడుగంటాయి.దీంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ హరినాథరెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన పాపాఘ్ని నదిని పరిశీలించారు.పులివెందుల కాంగ్రెస్ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, డాక్టర్ సుబ్రమణ్యం, ఉత్తన్న, రమణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

సీకేదిన్నె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా యు.లక్ష్మివెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో శనివారం ఎంపీడీవో కుళాయిబాబు, ఈవోఆర్‌డీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడుగా నారాయణరెడ్డి, కోశాధికారిగా శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీగా సంపత్‌కుమార్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా ప్రేమలత ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి

పులివెందుల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సాధారణ పిల్లల్లాగే దివ్యాంగ పిల్లలను పరిగణించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని పులివెందుల ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య సూచించారు. శనివారం స్థానిక రమణప్ప సత్రం స్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాబున్ని పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా పంపిణీ



కడప సెవెన్ రోడ్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు కడప రహమతీయ ఫంక్షన్ ప్యాలెస్‌లో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, రెండో పట్టణ ఎస్ఐ హుస్సేన్ ఈ కార్యక్రమానికి హాజరై మహిళలకు తోఫా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తస్లీమ్, లక్ష్మీదేవి, కరిమున్, చాంద్‌బేగం, నూర్ బాష తదతరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల కోసం ఉద్యమించాలి

కడప సెవెన్ రోడ్స్ మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల కోసం ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప తెలిపారు. శనివారం కడప ఆర్కేనగర్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న దళిత వర్గం ఏకమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు

కడప కలెక్టరేట్, మార్చి22(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌మాయలో పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు గౌస్ పీర్ సే అధ్యక్షుడు సయ్యద్ గౌస్‌పీర్ బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో చిక్కుద్దు-జీవితాలను నాశనం చేసుకోవద్దంటూ రూపొందించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అలీఖాన్, చంద్ర శేఖర్‌రెడ్డి, సంజయ్‌కాంత, రఫీక్‌ఖాన్, సుబ్రమణ్యం, ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు రైతులకు లాభదాయకం

చెన్నూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేస్తే అది గ్రామ పంచాయతీకి ఆదాయ వనరుగా మారడంతో పాటు రైతులకు ఆ ఎరువుల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం రామనపల్లెలోని ఎస్‌డబ్ల్యూపీసీలో వానపాముల ఎరువులు తయారీని పరిశీలించారు.

రోడ్డుభద్రతా నియమాలను పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రోషన్

కమలాపురం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సీఐ రోషన్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక మూడురోడ్ల కూడలిలో ప్రమాదాలు నివారించాలి, రోడ్డుభద్రతను పాటించాలని సీఐ , ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆటో డ్రైవర్లు, బైక్ రైడర్‌లతో మీటింగ్ ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు పంచాంగం వితరణ

కడప కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విశ్వాసనామ సంవత్సరాన్ని పురస్కరించుకుని టీటీడీ ముద్రించిన పంచాంగాలను ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని ఆకుల వీధిలో వెలసిన రాజరాజేశ్వరీదేవి దేవస్థానంలో వితరణ కార్యక్రమం జరుగనుందని, నగరంలోని అర్చక, బ్రాహ్మణ, పురోహితులందరూ తప్పక హాజరుకావాలని ఆ ఆలయ ప్రధాన అర్చకులు పిడతల గోపాలకృష్ణశర్మ తెలిపారు. పంచాంగ వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. హరిప్రసాద్, దేవదాయ ధర్మాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ జి. మల్లికార్జునప్రసాద్ హాజరుకానున్నారన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

కడప క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహన దారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని లేదంటే చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కడప నగరం రాజంపేట రోడ్డులోని బైపాస్ వద్ద రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్సుఆర్‌సీ ట్రిపుల్ డ్రైవింగ్‌లను గుర్తించి వారికి డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు.

భక్తుల సేవలో తరిద్దాం

కడప మారుతీనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వరస్వామిని దర్శించుకునే భక్తుల సేవలో శాశ్వతంగా తరించేందుకు వీలుగా ముందుకు సాగుతామని పొలతల మల్లేశ్వరస్వామి రజక అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు మచ్చయ్యగారి మల్లయ్య పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం స్థానిక మృత్యుంజయకుంట లోని సమితి కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో సమితి సభ్యులు సి.కొండయ్య, మల్లేష్, శివశంకర్, యోగానందం, ఆంజనేయులు, సుబ్బరాయుడు, పవన్‌కుమార్, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు రాష్ట్రస్థాయి పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

వేంపల్లె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ యూత్ పార్లమెంటు రాష్ట్రస్థాయి పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. కడప నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పార్లమెంట్-2025 రీజనల్‌స్థాయి ఆటల పోటీల్లో ట్రిపుల్‌ఐటటీ విద్యార్థులు పాల్గొన్నారు. అన్నమయ్య, కడప జిల్లాల నుంచి 200 మంది పాల్గొనగా ఎన్ఎస్ఎస్ 6వ విభాగం అధికారి కోనప్ప, కళ్యాణ్ చక్రవర్తి పర్యవేక్షణలో విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా దస్తగిరి, బాష జిల్లాస్థాయిలో తృతీయస్థానం పొందారు. కంబగిరి స్వామి, హేమంత్‌కృష్ణ, వెంకటసాయినాథ్‌రెడ్డి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఏఓ రవికుమార్ తెలిపారు. ఈ విద్యార్థులను డైరెక్టర్ కుమార స్వామిగుప్త, అకడమిక్ రమేష్, కైలాష్ అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

ముందస్తు ఉగాది సంబరాలు



సింహాద్రిపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవరంగుట్టపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచి మన సాంప్రదాయ పద్ధతులు అలవాటు చేసేందుకే పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలు ఏర్పాటు చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణమంతా రంగు రంగుల ముగ్గులతో అలంకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్ర, ప్రశాంతి, లక్ష్మీగౌరి, అంజలి, విద్యార్థులు, విద్యా కమిటీ ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్‌లు శివకుమార్, పావని పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో మృత్యుంజయకుంట

కడప సెవెన్ రోడ్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం కడప నగరం 11 డివిజన్ మృత్యుంజయకుంటలో ప్రచార చైతన్య యాత్రలు నిర్వహించారు. ఇందులో భాగంగా మృత్యుంజయకుంట ప్రజలు సమస్యలు సీపీఎం దృష్టికి తీసుకొచ్చారు. సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ కడప మృత్యుంజయకుంట దశాబ్దాల తరబడి పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. ఈ ప్రచార యాత్రలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, నగర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలి

కమలాపురం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలని సూపర్‌వైజర్లు భారతి, వెంకటసుబ్బమ్మ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వెలుగు కార్యాలయ సభాభవనంలో అంగన్వాడీ టీచర్లకు పోషకాహార పోషణ్ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలకు పౌష్టికాహారం సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యం తదితర వాటిని వివరించారు.

ఉపాధితో పనికి తగ్గ వేతనం

చెన్నూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) :ఉపాధి హామీలో పనిచేసే కూలీలకు పనికి తగ్గ వేతనం దొరుకుతుందని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు రామనపల్లె, రాచిన్నాయపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో శనివారం పరిశీలించారు.

గంబూషియా చేపలతో దోమల లార్వా నివారణ

సీకేదిన్నె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గంబూషియా చేపలతో దోమల లార్వాను నివారించవచ్చని సీహెచ్‌వో సుకుమార్ తెలిపారు. నిలువ ఉన్న నీటిలో గంబూషియా చేపల పిల్లలను వదలడంతో పెరిగే దోమల లార్వాలను నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా చింతకొమ్మదిన్నెలోని నీటి కుంటలో గంబూషియా చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, మురళీధర్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మహేశ్వరి

సీకేదిన్నె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఫారంపాండ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చింతకొమ్మదిన్నె సర్పంచ్ కంది మహేశ్వరి తెలిపారు. చింతకొమ్మదిన్నె పంచాయతీలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన ఫారంపాండ్ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుళాయిబాబు, ఏపీవో రామాంజులరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్ అండ్ బైక్‌రేస్‌లో శనివారం లక్కీడ్రా తీస్తున్న చెన్నూరు తహసీల్దార్ సరస్వతి


లక్ష్మి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో లక్ష్మినరసింహస్వామి

బద్వేలు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధి లోని వల్లెరవారిపల్లె లో వెలసిన లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో శని వారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకం అర్చన నిర్వహించారు. మధ్యాహ్నం వల్లెరవారిపల్లె చెందిన బెల్లం ఓబుల్‌రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

మార్కెట్ లీజు వేలం వాయిదా

ప్రొద్దుటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ తాత్కాలిక కూరగాయల మార్కెట్ లీజుకు బహిరంగ వేలం ఈనెల 25వ తేదీకి వాయిదా వేసినట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. వేలం పాటలో పాల్గొను వారు తప్పని సరిగా 25 లక్షల డిపాజిట్టుతోపాటు కమిషనర్ పేరుతో రెండు ఎంటీ చెక్కులు ఇవ్వాలన్నారు. మార్కెట్‌తో పాటు వాహనాల పార్కింగ్, మాంసం, చేపల మార్కెట్‌కు, క్యాంటీన్‌కు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.





అడుగంటిన కన్నెలవాగు చెరువు

● ఆందోళనలో ఆయకట్టు రైతులు ● ఎమ్మెల్యే పుట్టా చొరవ చూపాలంటున్న జనం ●తాగునీటికి కష్టాలు తప్పవంటున్నవైనం


నీరులేక వెలవెలబోతున్న కన్నెలవాగు చెరువు

ఖాజీపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు భూగర్భజలాలు అడుగంటిపోతుండడంతో కన్నెలవాగు చెరువు నీరులేక వెలవెలబోతోంది. చెరువులో గుంతల్లో మాత్రమే నీరు కొద్దిగా ఉండడంతో వేసవి ఎండలకు అవికూడా అడుగంటుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాజీపేట మండల పరిధిలోని సీతానగరం సమీపంలోగల కన్నెలవాగు చెరువుకు కొండల్లో వర్షం కురుస్తూనే నీరు వస్తుంది. గత రెండు సంవత్సరాలుగా వర్షం సరిగా పడకపోవడంతో చెరువు నిండలేదు. ఈ చెరువు కింద దాదాపు రెండు వేల ఎకరాలు సాగులో ఉంది.

పది గ్రామాలకు ఆ చెరువే దిక్కు

కన్నెలవాగు చెరువు నీరు మండల పరిధిలోని కూనవారిపల్లె, సీతానగరం, పాటిమీదపల్లె, కొత్తపేట, చెన్నముక్కపల్లె, కొత్తనెల్లూరు, ముళ్లపాకు, చెముళ్లపల్లె తదితర పది గ్రామాలకు కల్పతరువుగా ఉంటోంది. చెరువులో పుష్కలంగా నీరుంటే గ్రామాల్లోని బోరుబావులకు నీరు వస్తుంది. దీంతో ఆయకట్టుకు నీరులభిస్తుంది.

ఎమ్మెల్యే చొరవ చూపి చెరువు నింపాలి

మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ చొరవ చూపి కన్నెలవాగు చెరువుకు తెలుగుగంగ నీటిని తరలించి నింపాలను ప్రజలు కోరుతున్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉండగా చెరువుకు నీరు ఇచ్చి పుట్టా సుధాకర్ యాదవ్ రైతుల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. కాగా ఇటీవల నియోజకవర్గంలోని మైదుకూరు చెరువులకు రెండోసారి నీరు సరఫరా చేయించి నింపిన విధంగానే కన్నెలవాగుచెరువుకు కూడా నీరు నింపాలను ప్రజలు, ఆయకట్టు రైతులు కోరుతున్నారు. చెరువుకు నీరు వస్తే తాగునీటికి కష్టాలుండవం టున్నారు.

నీటి వృథాను తక్షణం అరికట్టాలి

చెరువు కట్టకింద తెలుగుగంగ కాలువ ఉండడంతో చెరువులోని నీరంతా లీకేజీ అయి కాలువగుండా వృథాగా పోతోందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం మరమ్మతులు చేపడితే గ్రామాలకు నీటి ఎద్దడి ఉండదంటున్నారు.

రోడ్డుపైన ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించండి

బద్వేలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలు షాపులవారు రోడ్లను ఆక్రమించి ఉంటే వాటిని తక్షణమే తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన సిద్దవటం రోడ్డులోని పలు వ్యాపారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపులకు ముందుభాగంలో డ్రమ్ములు, పాతపట్టలు కట్టడం, పాతరేకులు ముందుకు పెట్టి పట్టణ సుందరీకరణ దెబ్బతీస్తున్నారన్నారు. సింగల్‌యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

రోడ్డుపై అడ్డంగా ఆటోలు నిలిపితే చర్యలు తప్పవు

బద్వేలుటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై అడ్డంగా ఆటోలను ఎక్కడపడితే అక్కడ ఆపితే చర్యలు తప్పవని సీఐ రాజగోపాల్, ఎస్ఐ సత్యనారాయణలు హెచ్చరించారు. శనివారం నాలుగురోడ్ల కూడలిలో ఆటోడ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.చట్టాలను అతిక్రమించి వాహనాలు నడపరాదని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని వారు సూచించారు.

ఎస్సీ వర్గీకరణ చిరకాలస్వప్నం

జమ్మలమడుగు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మాదిగల చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు జంగాల మునిస్వామి తెలిపారు. శనివారం జమ్మలమడుగు ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ మాదిగ ఉప సంఘాలతో కలిసి సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పాపోడు, రాజశేఖర్, ఆంజనేయులు, ఓబుళమ్మ, నాగసుబ్బమ్మ, పార్వతి, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి చల్ల కార్యక్రమం

మైదుకూరు రూరల్ ,మార్చి22(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు, పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లి దేవర కార్యక్రమంలో భాగంగా శనివారం చల్ల కార్యక్రమం భక్తులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే పెద్దమ్మతల్లికి వేద పండితులచేత ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్దమ్మతల్లి ఆలయం వద్ద పెద్ద ఆర్చి పెట్టి అందులో అమ్మవారు వివిధ రూపాలలో అబ్బురపరిచేలా నిర్మించారు.ఎ౦దలాది మంది భక్తులు పెద్దమ్మతల్లిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సచివాలయం తనిఖీ చేసిన ఎంపీడీవో

ముద్దనూరు మార్చి22(ఆంధ్రజ్యోతి):మండల పరిధి యామవరం గ్రామంలోని పలు సచివాలయాలను శనివారం ఎంపీడీవో ముకుందారెడ్డి తనిఖీ చేశారు. అందులో భాగంగా సచివాలయం ను తనిఖీ చేసి హాజరుపట్టిక పరిశీలించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడి వసతుల పై ఆరాతీశారు. అంతేకాకుండా యామవరం గ్రామలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వీరభద్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చాపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు- మైదుకూరు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గాయపడినవారిలో లక్ష్మిపేట గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి, సీతారామపురం గ్రామానికి చెందిన ఓబుళరెడ్డిలు ఉన్నారు. ఇద్దరు వ్యక్తుల్లో ఓబుళరెడ్డి బైక్‌పై వస్తుండగా మహేశ్వర్‌రెడ్డి మరో బైక్‌పై వెనుకవైపు నుంచి వచ్చి అతన్ని ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడి బలమైన గాయాలయ్యాయి. మహేశ్వర్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు

బద్వేలుటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్‌సీఐ రాజగోపాల్ అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రికెట్ మ్యాచ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలి

కలసపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కలసపాడు ఎస్ఐ మద్దిలేటి సూచించారు. శనివారం కలసపాడు సర్కిల్‌లో వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినపుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక మంది తమ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడంలాంటి పనులు చేయకూడదన్నారు. కార్యక్రమంలో పోలలీసు సిబ్బందితో పాటు ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో: రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని ఎస్ఐ కత్తి వెంకటరమణ సూచించారు. శనివారం మండల కేంద్రమైన రాజుపాలెం పోలీసుస్టేషన్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లలో వచ్చే వివిధ వీడియోకాల్స్, అసభ్యకర పోస్టులు ఇతరులకు పంపించడం నేరమని వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు.

మహిళలపై దాడికి పాల్పడ్డ వ్యక్తికి జైలు శిక్ష

బద్వేలు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎగువ బ్రాహ్మణ వీధిలో ఈ నెల 19న మహిళలపై దాడి చేసి గాయపరిచిన గురుతరుణ్ అనే వ్యక్తికి బద్వేలు కోర్టు వారు 14 రోజుల జైలు శిక్ష విధించినట్లు అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి నిందితున్ని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరచగా నిందితుడికి కోర్టు శిక్ష విధించడంతో కడప సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపడం జరిగిందని తెలిపారు.

విద్యార్థిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చౌడూరులో ఉన్న ఓ స్కూలులో పాఠశాల డీన్ దాడి చేయడంతో 8వ తరగతి విద్యార్థి మూలే సాత్వికొరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. డీన్ గణేష్‌రెడ్డి తీవ్రంగా కొట్టడంతో ఆ విద్యార్థి చేతికి తీవ్ర గాయాలు కాగా విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు రూరల్ పోలీసు స్టేషన్‌లో డీన్‌పై ఫిర్యాదు చేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


విద్యార్థినికి ఉపకార వేతనం అందజేస్తున్న ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్య ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 500 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేయా లని కోరారు. కేసీ పుల్లయ్య తనకు మంచి మిత్రుడని, ఆయన వారసత్వాన్ని ఆయన కుమారులు కొనసాగించడం అభినందనీయమన్నారు. టీటీడీ మాజీ సభ్యుడు మారుతీప్రసాద్, తెలంగాణా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కె.సుజాతలు మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు కేసీపీ ఫౌండేషన్ ఉపకార వేతనాలు అందజేయడం అభినందనీయమన్నారు. కేసీపీ ఫౌండేషన్ చైర్మన్ కె.అనిల్‌కుమార్, కృష్ణవేణమ్మ, సుశీల్ కుమార్, చల్లా సుధ, వంకదార వీరభద్రయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో విద్యుత్తు బస్సుల ప్రైవేటీకరణ తగదు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో విద్యుత్తు బస్సుల ప్రైవేటీకరణ తగదని సీపీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్‌లు పేర్కొన్నారు. శనివారం విద్యుత్తు బస్సుల ప్రైవేటీకరణకు నిరసనగా చేపట్టిన చలో పార్లమెంటు బుక్‌లెట్లను ఆవిష్కరించారు. ఆర్టీసీని కాపాడుకోవడానికి ఈనెల 24న చలో పార్లమెంటు కార్యక్రమం చేపట్టామని ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంగన్వాడీల్లో నాణ్యమైన విద్య

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రీ స్కూల్ విధానంలో నాణ్యతతో కూడిన విద్యాబోధనలు అందించేందుకు శిక్షణ ద్వారా కార్యకర్తలను సిద్ధం చేస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో తెలిపారు. రూరల్ కార్యాలయంలో సాగిన మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. రూరల్ సీడీపీవో అరుణకుమారి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు శిక్షణ అందించారు.

కౌన్సిలర్లకు తెలియకుండానే పనులు చేస్తారా..?

● నిబంధనల ప్రకారమే పనులు చేస్తున్నామన్న కమిషనర్


మాట్లాడుతున్న కమిషనర్

ఎర్రగుంట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వార్డులో తమకు తెలియకుండా పనులు ఎలా చేస్తున్నారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రగుంట్ల నగరపంచాయతి సర్వసభ్య సమావేశం శనివారం చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను ఒక్కొక్కటిగా చదువుతుండగా కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం చెప్పారు. తమ వార్డుల్లో అనేక సమస్యలున్నాయని వాటిని పరిష్కరించకుండా ఇతర పనులకు ప్రాధాన్యత ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. రూ.24లక్షలతో ఇదివరకే డ్రైన్ల క్లీనింగ్‌కు పెట్టి బిల్లులు తీసుకున్నారని, మళ్లీ రూ.10లక్షలు ఎందుకు పెట్టారని కౌన్సిలర్లు ఆలి, నాగిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు డి.సూర్యనారాయణరెడ్డిలు ప్రశ్నించారు. తమ వీధిలో విద్యుత్ మెయిన్‌లైన్ వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులున్నాయని, మనుషులు చనిపోతున్నారని చెప్పినా పట్టించుకోవడంలేదని విమర్శించారు. వార్డుల్లో కుళాయి కనెక్షన్లు కట్ చేయడంపై మండి పడ్డారు.

లిఖిత పూర్వకంగా ఇవ్వండి: సభ్యులు ఎవరైనా సమస్యలుంటే లిఖిత పూర్వకంగా తమకు ఇస్తే వాటిని కౌన్సిల్‌లో పెట్టి ఆమోదించి ప్రాధాన్యతాపరంగా పరిష్కరిస్తా మని కమిషనర్ పేర్లి శేషఫణి పేర్కొన్నారు. నీటి సరఫరా, శానిటేషన్‌కు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని కమిషనర్ సమాధానం చెప్పారు. జగనన్న కాలనీలో రూ2.కోట్లతో అభివృద్ది పనులు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారమే పనులు చేస్తున్నామని కౌన్సిల్ సభ్యులు నిబంధనలు తెలుసుకోకుండా మాట్లాడడం తగదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండల పరిధిలో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దారు జాన్సన్ తెలిపారు. స్థానిక సోమిరెడ్డిపల్లె రెవెన్యూ గ్రామ పొలం సర్వే నెం.312లో 2 ఎకరాల 56 సెంట్లు వాగు, వంక పొరంబోకు స్థలాన్ని ఇటీవల కొంత మంది ఆక్రమిస్తున్నారని తమ దృష్టికి రావడంతో శనివారం వీఆర్వో సుధాకర్ వెళ్లి అక్కడ ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేశారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దారు హెచ్చరించారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో ఉన్న బోర్డులను తీసివేస్తే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని డిప్యూటీ తహసీల్దారుతెలిపారు.

కలల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకోండి


మాట్లాడుతున్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కమిషన్ డైరెక్టర్

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంతో మీ కలల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకోవాలని రాష్ట్ర కార్య గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ ఎస్.గ్రిప్ పిలుపునిచ్చారు. శనివారం ప్రొద్దుటూరు మండల సమాఖ్య కార్యాలయంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి కల్పనలో భాగంగా గ్రామీణ ప్రాంత మహిళలకు 35 శాతం, పట్టణ ప్రాంతంలో 25 శాతం సబ్సిడీతో యూనిట్లు గ్రౌండింగ్ చేస్తారన్నారు. సేవా రంగంలో రూ.25 లక్షల వరకు, తయారీ రంగంలో రూ.50 లక్షల వరకు బ్యాంకులు లోన్లు ఇవ్వనున్నాయన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు ఎల్‌డీఎం జి.జనార్ధన్, ఇతర బ్యాంకు అధికారులు, ఎన్ఎన్.క్రిష్ణ, వి.కోటిరెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం ఎస్.వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అంజనీకుమార్

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆలయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్‌లు తెలిపారు. శనివారం ఆలయంలో హైదరాబాదుకు చెందిన నారాయణ హృదయాలయ ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ అంజనికుమార్ 110 మంది మోకాళ్లనొప్పులు, నడుం నొప్పులు, కీళ్లనొప్పులతో బాధపడుతున్నవారిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అవసరమైనవారికి రాయితీపై ఎక్స్‌రే, స్కానింగ్ సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఎర్రగుంట్ల,మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ 4వ స్టేజ్ 600మెగావాట్ల ప్లాంట్‌లో ఏళ్లతరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించడం దారుణమని వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని యూనియన్ నేతలు కాంట్రాక్ట్‌లేబర్ యూనియన్ రీజనల్ కమిటీ సీఈ గౌరీపతికి వినతిపత్రాన్ని అందజేశారు. కోల్‌ప్లాంట్ క్లీనింగ్ శాఖలో పనిచేస్తున్న 20మంది కాంట్రాక్టు కార్మికులను పనిదినాలు అయిపోయాయని ఉన్నపలంగా తొలగించారన్నారు. ఈవిషయంపై సంబంధిత అధికారులను, కాంట్రాక్టు కంపెనీ(వశిష్ట) వారిని అడుగగా పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని సీఈ దృష్టికి తీసుకొచ్చారు. వారిని వెంటనే పనిలోకి తీసుకుని వేతనాలు చెల్లించాలని సంఘం నేతలు కోరారు.

పోక్సో చట్టం పై విద్యార్థులకు అవగాహన

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 22(ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టం పై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు సూచనలతో రెండవ అదనపు జిల్లా జడ్జి కె. సత్యకుమారి, మండల న్యాయ సేవా అధికార సంస్థ వారు స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉన్న బీసీ బాలికల వసతి గృహంలో సమాజంలో మహిళల పైన జరిగే అఘాయిత్యాలు, తదితర వాటి వల్ల ఇబ్బంది కలిగితే పోక్సో చట్టం ద్వారా తప్పు చేసిన వారిని శిక్షించవచ్చని తెలిపారు. అనంతరం వసతి గృహం తనిఖీ చేశారు. అనంతరం సబ్ జైలును కూడా తనిఖీ చేశారు.

● ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జ్ షేక్. ఫైజున్నిసా సంజీవనగర్ లోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ 1 బాలికల వసతి గృహంలో విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఉన్నతమైన చదువుతో మంచి భవిష్యత్ ఉంటుందని ప్రతి ఒక్కరు మంచిగా చదువుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు బహుకరించారు.

చిన్నారుల రక్షణ విషయంలో శ్రద్ధ వహించాలి

గోపవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల రక్షణ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీనియర్ సివిల్ జడ్జి పద్మజ పేర్కొన్నారు. గోపవరం మండలంలోని లక్కవారిపల్లెలో శనివారం లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఉత్తర్వులు మేరకు మండలలీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులపై జరుగుతున్న ఇబ్బందికర విషయాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఏఎస్ఐ చంద్రమౌళి, కాల్వపల్లె ఉన్నత ఉపాధ్యాయులు, అంగన్వాడీలు ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కలిసికట్టుగా కృషిచేయండి

కలసపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి ప్రజాప్రతినిదులు, అధికారులు కలిసికట్టుగా కృషిచేయాలని ఎంపీపీ నిర్మలాదేవి పేర్కొన్నారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మడల పరిషత్ సభాభవనంలో సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ మహబూబ్‌బి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా సర్పంచులు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చెత్తసేకరణ కొన్ని గ్రామ పంచాయతీల్లోనే సాగుతోందని, పారిశుధ్యం కోసం అందరు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల నివేదికను అధికారులు చదివి వినిపించారు. మినీ గోకులాలు, బీసీల రుణాలు పార్టీలకతీతంగా మంజూరు చేయాలని సర్పంచులు సమావేశంలో పట్టుబట్టారు. సమావేశంలో జడ్పీటీసీ గురివిరెడ్డి, వైద్యాధికారి శైలజ, డీటీ మోహన్‌రాజు, ఈఓపీఆర్డీ మురళీమోహన్, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, ఏఈలు రాము, బాలసుబ్రమణ్యం, ఏఓ జాకీర్ షరీఫ్, పశువైద్యాధికారి వెంకటేశ్వరరావు,సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫ్లైయాష్ దుమ్మును అరికట్టకపోతే ఆందోళన

ఎర్రగుంట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ యాష్‌పాండ్ నుంచి టిప్పర్లతో తీసుకెళుతున్న ఫ్లైయాష్‌తో దుమ్ము అరికట్టకపోతే ఆందోళన తప్పదని కలమల్లవాసులు ఎస్ఐకి శనివారం వినతిపత్రం ద్వారా విన్నవించారు. యాష్‌పాండ్ నుంచి తడి ఫ్లైయాష్‌ను బారీగా కార్చుకుంటూ తీసుకెళుతున్నారని, అది ఆరిన వెంటనే దుమ్ముగా మారి గాలికి ఇళ్లలోకి వస్తోందన్నారు. కళ్లలో పడి వ్యాధులొస్తున్నాయన్నారు. టిప్పర్లలో కెపాసిటికి మించి లోడ్ వెళుతోందని, దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందన్నారు. టిప్పర్లపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ ఇచ్చారని కలమల్ల వాసులు గిరి తదితరులు పేర్కొన్నారు.చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని వారు తెలిపారు.

పిల్లలకు ఒత్తిడిలేని విద్య అందించాలి

కొండాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంగనవాడీ కేంద్రాల్లో పిల్లలకు ఒత్తిడిలేని విద్యను అందించాలి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. మండలంలోని చౌటిపల్లె జడ్పీహైస్కూల్‌లో అంగనవాడీ టీచర్లకు మూడవరోజు శిక్షణా కార్యక్రమం లో భాగంగా 0-3 సంవత్సరాల పిల్లలకి నవచేతన, 3-6 సంవత్సరాల పిల్లలకి ఆధార్ శీలా స్టీములైజేషన్ గురించి అవగాహన కల్పించారు. పోషణ్‌బీ, పడాయి బీ శిక్షణా కార్యక్రమాన్ని మూడురోజుల పాటు నిర్వహిచినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ రాంబాబు, అంగనవాడీ టీచర్లు పాల్గొన్నారు.

అయిదుగురు జూదరుల అరెస్టు

దువ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని ఎస్టీ కాలనీలో జూదం ఆడుతున్న అయిదుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వారి వద్ద 1950 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అయిదుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అప్పుతీసుకొని ఇవ్వలేదని ఘర్షణ

బద్వేలుటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద శనివారం హైదరాబాదుకు చెందిన నాగరాజు అనే వ్యక్తి చింతల చెరువు గ్రామానికి చెందిన శివరాం వద్ద అప్పుతీసుకొని ఇవ్వలేదని ఘర్షణ దిగాడు. దీంతో అక్కడ ఉన్న పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా ఇరువర్గాల వారు డబ్బులు ఎందుకు ఇవ్వవంటూ మాటా మాటా పెరిగి పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే, పోలీసుల ఎదుటే ఘర్షణకు దిగారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాల వారిని చెదరగొట్టి నాగరాజు, శివశంకర్, శివరాం, క్రిష్ణ అనే వ్యక్తులపై కేసునమోదు చేశారు.

